ప్రజాశక్తి

ఆదివారం 14 సెప్టెంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

సేవలు బంద్

◆ స్విగ్గీ, జొమాటో, ఇన్‌స్టామార్ట్ రైడర్ల సమ్మె విజయవంతం

◆ పలుచోట్ల నిరసనలు, ఆందోళనలు

డైమండ్ పార్కు జంక్షన్‌లో నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, పిఎం.పాలెం విలేకరులు

తమ సమస్యలు పరిష్కరించాలంటూ విశాఖలో రెండు రోజులపాటు సమ్మెకు దిగిన స్విగ్గీ, జొమాటో, ఇన్‌స్టామార్ట్ రైడర్లు తొలిరోజు సేవలను పూర్తిగా బంద్ చేశారు. ఆందోళనలు, నిరసనలతో నగరాన్ని హోరెత్తించారు. 12 వేల మంది రైడర్లు శనివారం సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె ప్రభావం స్విగ్గీ, జొమాటో, ఇన్‌స్టామార్ట్ సంస్థలపై పడింది. పలు హోటళ్లు, రెస్టారెంట్లకు ఈ ప్లాట్‌ఫారాలపై ఎవరైనా ఆహార పదార్థాలు ఆర్డర్ పెట్టుకుంటే 'నాట్ డెలివరీ కరెంట్లీ' అన్న సందేశాలు వారికి వచ్చాయి. ద్వారకా నగర్, ఎంవిపి.కాలనీ, మధురవాడ, ఎన్ఎడి జంక్షన్, గాజువాక, పెందుర్తి, కూర్మన్నపాలెం సహా నగర వ్యాప్తంగా ఎక్కడికక్కడ రైడర్లు నిరసనలు తెలిపారు. గతంలో ఇచ్చిన రేట్లు పునరుద్ధరించాలని, అన్యాయంగా తొలగించిన రైడర్లకు ఐడిలు తిరిగి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా డైమండ్ పార్క్ జంక్షన్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా అధ్యక్షులు బి.జగన్, పిఎం.పాలెంలోని ఇన్‌స్టామార్ట్ వద్ద చేపట్టిన ఆందోళనలో సిఐటియు నాయకులు పి.రాజ్‌కుమార్ మాట్లాడారు. రైడర్లకు ఏదైనా సమస్య వస్తే చెప్పుకునే

నాథుడే విశాఖలో కరువయ్యాడని అన్నారు. పాత రేట్లను పునరుద్ధరించాలని కోరారు. మినిమం గ్యారెంటీ సాలరీ, ఇన్‌కం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని రైడర్ల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కూర్మన్నపాలెంలో నిరసన

లోక్ అదాలత్‌లో
అధిక కేసులు పరిష్కారం

రాష్ట్రంలో ఉమ్మడి విశాఖ జిల్లాకు నాలుగో స్థానం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, లీగల్ విలేకరి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 36 లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు చిన్నంశెట్టి రాజు మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ వల్ల కక్ష్యదారులకు సత్వర న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విశాఖపట్నం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ బెంచిలను, కక్ష్యదారులకు అందుతున్న సదుపాయాలను ఆయన పరిశీలించారు. రాత్రి 8 గంటల సమయానికి మోటార్ ప్రమాద కేసులు రెండు బెంచ్‌లు కలిపి 124 పరిష్కరించబడ్డాయి. నష్టపరిహారం కింద రూ.4,40,04,750 అందించబడింది. సివిల్ కేసులు 185, క్రిమినల్ కేసులు 10,190, ప్రీ లిటిగియేషన్ కేసులు 239 రాజీ అయ్యాయి. మొత్తంగా చూసినప్పుడు ఉమ్మడి విశాఖ జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. కేసులు భారీగా రాజీ కాగా, రాజీ మొత్తం దాదాపు రూ.25 కోట్లుగా ఉంది. న్యాయమూర్తులు, విశాఖపట్నం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, బార్ కౌన్సిల్ సభ్యులు, న్యాయవాదులు, పోలీసులు, అధికారులు, ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులు, బ్యాంకు అధికారులు, డెట్ రికవరీ ట్రిబ్యునల్, పారా లీగల్ వాలంటీర్లు, జివిఎంసి, ఇతర భాగస్వామ్య శాఖల సహకారంతో జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా జరిగిందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు మీడియాకు తెలిపారు.

నష్టపరిహారం చెక్కు అందిస్తున్న న్యాయాధికారులు

ఆనందపురం : ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మిగతా 2లో..

'ఉక్కు'పై ముసుగు తొలిగింది !

▶ వార్త 2లో..

పోరాటాలతోనే మెయిన్ సెంటర్లుగా మార్పు

▶ వార్త 6లో..

కోలాహలంగా బాలోత్సవం

▶ వార్త 3లో..

నృత్యాలతో ఆకట్టుకున్న కళాకారులు

ఆకట్టుకున్న వైశాఖి నృత్యోత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న 17వ వైశాఖి నృత్యోత్సవాల్లో శనివారం ఆహూతులను ఆకట్టుకునేలా కళాకారుల ప్రదర్శనలు సాగాయి. న్యూఢిల్లీకి చెందిన కథక్ నృత్యకారిణి షోవన్ నారాయణ్ తన 'త్రయ దర్శనం' నాట్య ప్రదర్శనతో అందరినీ మంత్ర ముగ్ధులను చేశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ కూచిపూడి కళాకారిణి గీతా నారాయణ్ సుదగాని కృష్ణ భగవానుని అవతారాలు, జీవనశైలిని వివరిస్తూ ప్రదర్శించిన నాట్యం అందరినీ ఆకట్టుకుంది. కేరళకు చెందిన కెవి.ముహమ్మద్ గురుక్కల్ కలారిపయట్టు నృత్య ప్రదర్శనకు చప్పట్ల వర్షం కురిసింది. కత్తి యుద్ధం మాదిరి ఈ ప్రదర్శన సాగింది.

రెండో రోజు కార్యక్రమానికి అతిథులుగా విశ్రాంత ఐఆర్ఎస్ సుదగాని రవిశంకర్ నారాయణ్, విశ్రాంత చీఫ్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ జె.సిరికుమార్, కళాభారతి అధ్యక్షులు ఎంఎన్ఎస్.రాజు, రైటర్స్ అకాడమీ అధ్యక్షులు వివి.రమణ మూర్తి హాజరయ్యారు

యువకుడు అనుమానాస్పద మృతి

◆ హత్యేనంటున్న కుటుంబీకులు ◆ ప్రేమ, కులం, డబ్బు కారణంతో అరుణాచలంలో మట్టుబెట్టినట్టు అనుమానం

◆ పోలీసుల అదుపులో వెంకటాపురం మాజీ సర్పంచ్ భార్య, కుమార్తె ?

ప్రజాశక్తి - దేవరాపల్లి : అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలోని కాశీపురం గ్రామానికి చెందిన డెక్క నవీన్ (23) తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలంలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటనతో కాశీపురం ప్రాంతమంతా శనివారం విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇది ముమ్మాటికీ హత్యేనని మృతుని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. పలువురి కథనం ప్రకారం.. జాతీయ స్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుడైన నవీన్ రెండు నెలల క్రితం ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం పొందాడు. కొంతకాలంగా ఆయన అచ్యుతాపురం మండలం సమీపంలోని పూడి గ్రామంలో ఉంటున్నాడు. అతని తల్లిదండ్రులు రాంబాబు, విజయ. ఈ నెల 8న ఉదయం 5.30 గంటలకు తీర్థయాత్రకు వెళ్తున్నానని చెప్పి నవీన్ ఇంటి నుంచి బయలుదేరాడు. బుధవారం అరుణాచలంలో ఉన్నానని వీడియో కాల్‌లో తల్లితో మాట్లాడాడు. అదే రోజు రాత్రి చెన్నయ్‌కు వెళ్తున్నానని తెలిపాడు. గురువారం ఉదయం అనూహ్యంగా ఒక యువకుడు ఫోన్ చేసి నవీన్ మేడ మీద నుంచి దూకి చనిపోయాడని చెప్పడంతో కుటుంబం షాక్‌కు గురైంది. తమ కొడుకు ఆత్మహత్య చేసుకునే అంత పిరికి వాడు కాదని, పథకం ప్రకారమే జరిగిన హత్య అని మృతుని తల్లిదండ్రులు రాంబాబు, విజయ ఆరోపిస్తున్నారు. తమ కుమారుడు ప్రేమించిన యువతి రాంబిల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సీర వెంకట్రావు కుమార్తె అని తెలిపారు. ఆమె తల్లి చిన్ని, బంధువులు కలిసి తీర్థయాత్ర పేరుతో నవీన్‌ను పిలిచి హతమార్చారని రాంబాబు, విజయ చెబుతున్నారు. ఈ కేసును నిష్పాక్షికంగా విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని హోం మంత్రి అనితను వారు కోరారు. ప్రేమిస్తే ఇంత దారుణంగా హతమారుస్తారా ? అంటూ విలపించారు.

కాశీపురం గ్రామస్తులు కూడా ఈ సంఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు. అరుణాచలం పోలీసులు ఇప్పటికే వెంకటాపురం గ్రామం మాజీ సర్పంచ్ భార్యను, కుమార్తెను అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ప్రేమ, కులం, డబ్బు ఈ హత్యకు కారణమని గ్రామస్తులు చెబుతున్నారు.

నవీన్ (ఫైల్ ఫొటో)

మొదటి పేజీ తరువాయి..

లోక్ అదాలత్‌లో అధిక కేసులు పరిష్కారం

నమోదైన కేసుల పరిష్కారానికి శనివారం భీమునిపట్నం 15వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ జరిగింది. 22 కేసులు రాజీ అయ్యాయి. ఈ సందర్భంగా ఆనందపురం సిఐ వాసు నాయుడు మాట్లాడుతూ ఫిర్యాదుదారులు, అర్జీదారుల పరస్పర అంగీకారంతో కేసులు సులభంగా పరిష్కారమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖలో నేడు బిజెపి సారథ్య సభ

- నగరానికి చేరుకున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : శనివారం ఉదయం 10 గంటలకు నగరంలోని రైల్వే న్యూ కాలనీ మైదానంలో బిజెపి సారథ్య యాత్ర బహిరంగ సభ జరుగనుంది. ముఖ్య అతిథిగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి, బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా హాజరుకానున్నారు. శనివారం రాత్రికే ఆయన విశాఖకు చేరుకున్నారు. ఆయనతో పాటు రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్.మాధవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, జిల్లా అధ్యక్షులు పరశురామరాజు సారథ్య సభలో పాల్గొననున్నారు. ఈ నెల 3న పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో బిజెపి సారథ్య యాత్ర ప్రారంభమైన సంగతి తెలిసిందే. విశాఖలో దీని ముగింపు సభ జరుగుతోంది. ఈ మేరకు నగరమంతా మోడీ, నడ్డా, మాధవ్‌లతో కూడిన భారీ కటౌట్లు, బ్యానర్లను ఆ పార్టీ శ్రేణులు ఏర్పాటు చేశాయి.

5500 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలోగల అన్ని సంక్షేమ వసతి గృహాల్లోని 5500 మంది విద్యార్థులకు శనివారం సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. 28 బిసి, 23 సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో వారికి ఈ సేవలు అందాయి. వైద్యాధికారులు వారికి తగు ఆరోగ్య సూచనలు చేశారు.

ఎయులో 15న అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఎయులో పొలిటికల్‌సైన్స్ విభాగం ఇనిస్టిట్యూట్ ఫర్ డెమోక్రటిక్ ఎంగేజ్‌మెంట్ అండ్ అకౌంట్ ఫౌండేషన్ ఆధ్వర్యం లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఐక్యరాజ్యసమితి సెప్టెంబర్ 15వ తేదీని అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవంగా ప్రకటించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పూర్వ రాజ్యసభ సభ్యులు, విశ్వహిందూపరిషత్ అధ్యక్షులు పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ హాజరవుతున్నారు. పోస్టర్ ఆవిష్కరణలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.విఆర్.రాజు, విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం, డీన్ ఆచార్య కె.శ్రీనివాసరావు, ఆచార్య జి.ఎం.జె.రాజు, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ టి.నాగరాజు, డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: అన్ని సాఫ్ట్‌వేర్ విభాగాల్లోనూ ప్లేస్‌మెంట్ కల్పించి విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యమని సంస్థ సెంట్రల్ మేనేజర్ వరదా రవికుమార్ అన్నారు. మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, విశాఖపట్నం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఆయన పాల్గొన్నారు. దీనిలో భాగంగా 25 మంది సివిల్ విద్యార్థులకు ఉపాధి కల్పించారు. ల్యాండ్స్కేప్ మోడలింగ్ టెక్నాలజీలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన లియో 3డి ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో కలిసి ఈ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్ మేనేజర్ మాట్లాడుతూ ఈ డ్రైవ్లో 175 మంది బిటెక్ సివిల్ విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో ఆటోకాడ్, రెవిట్ ఆర్కిటెక్చర్ లో నైపుణ్యం ఉన్న 25 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తగదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని,బిజెపి జాతీయ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జె. పి నడ్డా ప్రజలకు స్పష్టం చెయ్యాలని సిపిఐ డిమాండ్ చేసింది. శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఈ మేరకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎ.విమల, రాష్ట్ర సమితి సభ్యుడు ఎం.పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.కె రహిమాన్ మాట్లాడుతూ ఆదివారం విశాఖ పర్యటనకు వస్తున్న నడ్డా విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీ కరణ చేయమని, పార్లమెంట్ సాక్షిగా విభజనచట్టంలో హామీలు అమలు చేస్తామని హామీఇవ్వాలన్నారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్‌పరం చెయ్యడం లేదని చెపుతున్న కూటమి ప్రభుత్వం,ఇంకో పక్కన ఉక్కులో 43 విభాగాలను ఒక్కొక్కటిగా ప్రైవేట్ పరం చెయ్యడం వెనుక ఉన్న మతలబు ఏమిటో చెప్పాలన్నారు.

ఇగ్నోలో స్వచ్ఛతా పక్షోత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛభారత్ అభియాన్ పథకంలో భాగంగా స్వచ్ఛతా పక్షోత్సవాలు సెప్టెంబర్ 1 నుంచి 15 సెప్టెంబర్ వరకూ నిర్వహించినట్లు ఇగ్నో సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. దీనిలో భాగంగా ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఇగ్నో ప్రాంతీయ కార్యాలయంలో స్వచ్ఛతా ప్రతిజ్ఞ నిర్వహించారు.

‘ఉక్కు’పై ముసుగు తొలిగింది !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ విషయంలో కూటమి పార్టీల్లోని టిడిపి, జనసేనల అసలు వైఖరి బట్టబయలైంది. ఉక్కుకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని ఆ పార్టీలు చెబుతున్న మాటలన్నీ ఉత్తివేనని విశాఖ వేదికగా శనివారం బిజెపి ఎపి అధ్యక్షుడు పివిఎన్.మాధవ్ చేసిన వ్యాఖ్యలతో తేలిపోయింది. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ జరిగితీరుతుందని ఆయన అన్నారు. ‘ప్రైవేటీకరణ అన్ని దేశాల్లోనూ జరుగుతుంది. స్టీల్‌ప్లాంట్‌లో ఏదో జరిగిపోతుందని కొందరు అపోహలు సృష్టిస్తున్నారు’ అని మాధవ్ చెప్పుకొచ్చారు. దీంతో తెలుగుదేశం, జనసేన నేతలు బయటకు చెబుతున్న ‘ఉక్కు రక్షణ’ బూటకపు మాటలకు బిజెపి తెరదించినట్టయింది. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటుపరం చేయడమే మోడీ ప్రభుత్వ ఉద్దేశ్యమని మాధవ్ మాటలను బట్టి అర్థమవుతోంది.

దేశంలో 2014లో బిజెపి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఊపందుకుంది. 2019, 2024ల్లో గెలిచాక అడ్డూ అదుపూ లేకుండా ప్రైవేటీకరణ విషయంలో ముందుకెళ్తోంది. దేశ ప్రజలు, కార్మికవర్గం వ్యతిరేకిస్తున్నా పట్టడం లేదు. గత ఎన్నికల సమయంలో ఉక్కును కాపాడుతామని గెలిచిన టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ప్రస్తుత ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఎప్పుడూ కార్మికులు, కార్మిక సంఘాలపై దుష్ప్రచారం చేయడం తప్ప ఉక్కు రక్షణకు చేసిందేమీ లేదు. ఇఒఐల పేరిట ప్లాంట్‌లోని విభాగాలు ప్రైవేటుపరం కాబోతున్నా ఆయన నోరు మెదపడం లేదు. ప్లాంట్‌కు ప్యాకేజీ తెచ్చామని చెబుతూ సొంత డబ్బాకే పరిమితమవుతున్నారు. గతంలో ఉక్కు విషయంలో ఊగిపోయిన పవన్, కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా నోరు మెదపడం లేదు. ఈ చర్యలన్నీ ఉక్కు ప్రైవేటీకరణ కుట్రలకు ఊతమిచ్చేవే.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తూ..

విశాఖలోనే బిజెపి సభ

ఒకవైపు ఉత్తరాంధ్ర జీవనాడి అయిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను

ప్రైవేటీకరిస్తూ.. మరోవైపు విశాఖలోనే ఆదివారం బిజెపి రాష్ట్ర సభను నిర్వహిస్తోంది. ఆ సభకు సన్నద్ధంగా సమావేశాలు నిర్వహిస్తున్న బిజెపి నేతలు ఉక్కు పరిశ్రమను పరిరక్షించేందుకు పోరాడుతున్న వారిపై దురుసుగా మాట్లాడడం, తప్పుడు వ్యాఖ్యలు చేయడం, ప్రైవేటీకరణను సమర్థించడం పట్ల విశాఖ కార్మికవర్గం, ప్రజలు మండిపడుతున్నారు.

ప్రకటన

నా క్లయింటు **TATA CAPITAL LIMITED,** విశాఖపట్టణం, రిప్రెజెంటెండ్ బై మేనేజర్ వారి సంజాయిషీ పొంది ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా

ఈ దిగువ షెడ్యూలు ఆస్థిని గోలి రామకృష్ణ గారి భర్య శ్రీమతి గోలి మంగమ్మగారు ది 02-06-2025న గోపాలపట్నం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం. 1928/2025రుగా రిజిష్టర్ కాబడిన శెటిల్మెంటు దస్తావేజు రీత్యా దాఖలు పొందిన షెడ్యూలు ఆస్థిని సర్వ, సంపూర్ణ స్వాధీన హక్కు భక్తములతో నిర్వివాదముగా అనుభవించుచున్నారు.

ఇట్టి స్థితిలో ఈ దిగువ షెడ్యూలు ఆస్థిని గోలి రామకృష్ణ గారి భార్య శ్రీమతి గోలి మంగమ్మగారు హామీగా ఉంచి ఋణ సౌకర్యం పొందుట కొరకు **TATA CAPITAL LIMITED,** విశాఖపట్టణం వారికి అభ్యర్థన చేసియున్నారు.

కావున ఎవరికైననూ ఈ దిగువ షెడ్యూలు ఆస్థిపై గాని, ఎవరికైననూ, చట్టరీత్యా చెల్లదగు క్లయిములు గాని, మరియు ఏ విధమయిన అభ్యంతరములు గాని ఉన్నయెడల, వారు ఈ ప్రకటన తేది నుండి 07 రోజులలోపుగా లిఖిత పూర్వక ఆధారములతో తెలియపరచగలరు. సదరు గడువు తేదీలోగా చట్ట ప్రకారము చెల్లదగు ఎటువంటి అభ్యంతరములు గాని రాని యెడల, షెడ్యూలు ఆస్థిని నిర్వివాద ఆస్థిగా ఎంచి, నా క్లయింటు షెడ్యూలు ఆస్థిని హామీగా స్వీకరించి, ఋణ సదుపాయము కలుగజేయుదురు. ఆదర్శిలా వచ్చు ఎట్టి అభ్యంతరములు, క్లయిములుగానీ, చట్టపరంగా బైండు చేయ జాలవనియు, నా క్లయింటు షెడ్యూలు ఆస్థిపై పొందు హామీ మరియు తనఖా హక్కులను భంగము చేయజాలవనియూ ఇందుమూలముగా తెలియజేయుటమైనది.

షెడ్యూలు : విశాఖపట్నం జిల్లా, మధురవాడ జాయింటు సబురి॥ యిలాకా గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన, ఎండాడ గ్రామం తాలూకు, సర్వేనెం. 153/4రులో చేరిన, గుడ్లవానిపాలెం, తాటిచెట్లుపాలెం ఏరియాలో యున్నటువంటిన్నీ విస్తీర్ణం 111.88 చ॥గ॥లు, లేక 93.54 చ॥మీ॥లు కలిగిన స్థలం అందలి డోరు నెం. 10-60రు, పాత అసెస్‌మెంటు నెం. 100009/31489 రు, కొత్త అసెస్‌మెంటు నెం. 1086067457రులో నిర్మించబడిన 800 చ॥అ॥లు గ్రౌండు, 800 చ॥అ॥లు ఫస్టు మరియు 800 చ॥అ॥లు సెకెండు ఫ్లోరు కలిగిన ఆర్.సి.సి.మేడ యింటి సహితమైన ఆస్థికి హద్దులు

తూర్పు : వి.జయబాబుగారి ఆస్థి
దక్షిణం : జి.ఆదిగారి ఆస్థి
పడమర : ఎన్.సత్యనారాయణగారి ఆస్థి
ఉత్తరం : సి.సి.రోడ్డు

V(G) VIJAYA, Advocates
Flat No. 104, Ground Floor, Shree Ganesh Enclave,
Dondaparthi, Near Yerukamamba Temple,
VSP-530016 Cell : 9848282374, 8106523333, 9848286374

IN THE HONOURABLE COURT OF THE VII TH ADDITIONAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM
E.P.512/2024 in ARBITRATION
CASE NO.CP NO. RJ/SF/011/2023

Between:
M/s Sundaram Finance Ltd.,
21, Patullos Road, Chennai-600 002.
Rep.by Branch Office, represented by its authorized officer cum Branch manager, Visakhapatnam
...Petitioner/DHR

AND
MR.Sativada Tirupathi Rao.
And Another **...Respodents/JDRS**

ORDER XXI RULE54 NOTICE

To,
JDR.2:
MR.Yellapu.G.K.Phani Kumar.
S/O MR. Yellapu Nooka Raju,
D.no.4-21-21,Near Visaka Eye Hospital, Peda Waltair, L.B Colony,
Visakhapatnam-530017,AP.

Please take Notice above Named Decree Holder filed above E.P.512/2024 under order XXI Rule 54 CPC against you and the matter is coming your personal appearance and stands posted to **26-09-2025** on that day your personally or through Advocate attend before the Honourable Court **at 10.30 AM** failing the Honourable court will decided Under the court of Law in your obsence Exparty as per Law.

G.RAJANI, M.L.,
Advocate, Visakhapatnam,
Cell No.9391756546

DOCUMENT LOST

I, **MAHABOOB SIDDIQUE RAHAMAN,** S/o.Late Shaik Mahaboob, resident of D. No. 18-230, first floor, Adarsh Nagar Colony, Simhadripuram, Near Mahila Cooperative Bank, Visakhapatnam, AP 530013. I have lost my **registered original gift deed documents bearing number 4686/2006** Survey No: 7/4B, 233 SQ yards, registered at Gajuwaka sub Registrar and **IDFC Bank Empty self signed cheques 16 Leafs and 5 Signed Promissory Notes** when I was Travelled from Adharsh Nagar colony to Arilova On 10.06.25. If anyone found the same I request you to return the documents to me.
Cell No.9337886460

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT ANAKAPALLE
I.A.110/2025 IN O.S.31/2019

Between:
Smt. Jagarapu Lalitha Kumari
...Petitioner

And:
Lalam China Kondayya (Died) & others **...Respondents**

To
6, 8 RESPONDENTS
6) Lalam Gowthami,
D/o late Gangadhararao, aged about 36 years, resident of D.No.39-33-19/2, Madhavadhara Vuda colony, near RTO office, Vuda Layout, Madhavadhara, Visakhapatnam.
8) Lalam Bala Sirisha,
D/o late Gangadhararao, aged 29 years, resident of 39-33-19/2, Madhavadhara Vuda colony, near RTO office, Vuda Layout, Madhavadhara, Visakhapatnam.

NOTICE

పై నెంబరు I.A.ను 1వ రెస్పాండెంటు అయిన లాలం చినకొండయ్య గారి తరపు వారసులును చేర్చమని దాఖలు చేసియుంటిరి. కాగా పై నెంబరులో 6, 8 రెస్పాండెంట్లు అయిన మీకు నోటీసు నిమిత్తం **తే.22-09-2025దీకి** వాయిదా అయివున్నది. కావున మీరు సదరు తేదిన మీరుగాని మీ వకీలుగారి ద్వారాగాని పై కోర్టులో **ఉదయం గం.10-30 నిలకు** హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలయపరచుకోవలెను లేనిచో మీవరోక్షమందు తీర్మానించడమగునని ఇందుమూలంగ తెలయపరచడమైనది.

లంకజగన్నాథం
తే.13-9-2025దీ **లంకపార్వతీశ్వర్**
అనకాపల్లి అడ్వకేట్లు, అనకాపల్లి

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
I.A: 198/2024, I.A: 199/2024 in IA.352/2022 in IA.58/2022 in O.S: 58/2011

Between:
K. Kurma Rao ....Petitioner/Plaintiff
And: -
K. Jagga Rao (Died) & others
.....Respondents/Defendants

To,
R-7: Konada Sripathi, S/o Late Jagga Rao, Aged about 46 years, R/A Arun Enclave, Simhadri Valley, Dharapalam, Visakhapatnam, Pin: 530040.
R-8: Konada Srivijaya, D/o Late Jagga Rao, Aged about 44 years R/A --Rest do--
R-9: Konada Sreeja, D/o Late Jagga Rao, Aged about 35 years, R/A, --Rest do--

Notice to the Respondents-7 to 9:

It is to inform you all of you that the above IA's 198/2024, 199/2024 in IA.352/2022 in IA. 58/2022 in OS.58/2011 on the file of the Honourable Principal Senior Civil Judge at Srikakulam is posted to **26-9-2025** for your appearance. You are here by directed to appear before the above Court **at 10:30 A.M.,** on **26-9-2025** in person or through advocate without fail, otherwise the matter will be decided in your absence.

// BY ORDER OF THE HONOURABLE COURT //

PALISETTY MURALI KRISHNA
ADVOCATE,
SRIKAKULAM, CELL: 9440371133.

✆ 2573333, Max : 86287

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల సహకార పొదుపు మరియు పరపతి సంఘం లిమిటెడ్
రి.నెం. బి-1918 :: ఉక్కునగరం, విశాఖపట్నం-530 032

62/ఎజియం/2025-26/1 **మహాజనసభ నోటీసు** తేది : 05-09-2025

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల సహకార పొదుపు మరియు పరపతి సంఘం లిమిటెడ్ (రిజష్టర్ నెం.బి.1918) యొక్క **62వ సర్వసభ్య సమావేశము (General Body)** తేది **19-09-2025** (శుక్రవారం) సా॥ **6.00** గం॥లకు **స్టీల్ క్లబ్, ఆడిటోరియం, సెక్టార్-1, రష్యన్ కాంప్లెక్స్, ఉక్కునగరం** నందు నిర్వహించబడును.

చర్చనీయాంశాలు :

1. అధ్యక్షులవారి ప్రారంభ ఉపన్యాసము / President's Inaugural Speech.
2. మరణించిన సభ్యులకు “సంతాప తీర్మానం” / Tribute to the deceased members.
3. 2024-2025 సంవత్సరము యొక్క కార్యదర్శి నివేదిక ఆమోదించుట.
Approval of the Secretary's Report for the Year 2024-25
4. 2024-2025 సంవత్సరము యొక్క వార్షిక లెక్కలను ఆమోదించుట.
Adoption of Annual Accounts for the year 2024-25
5. 2024-2025 సంవత్సరము సవరించిన బడ్జెట్‌ను ఆమోదించుట.
Approval of Revised Annual Budget for the year 2024-25
6. 2024-2025 సంవత్సరము యొక్క లాభాలను బైలా ననుసరించి పంపిణీ చేయుట.
2024-2025 Profit Allocation as per Bye-laws
7. 2024-2025 సంవత్సరమునకు ఆడిట్ ఫీజు చెల్లింపు పై పున సమీక్ష.
To rivew on payment of Audit fees for the Financial Year 2024-25
8. 2025-26సంవత్సరము యొక్క వార్షిక లెక్కలను ఆడిట్ చేయుటకు ఆడిటర్‌ను నియమించుట కొరకు.
Appointment of Auditor for conducting Audit for the Financial Year 2025-26
9. ప్రతిపాదించిన బైలా సవరణలను చర్చించి ఆమోదించుట (ప్రస్తుతం సంఘ సభ్యుల సంఖ్య తగ్గుదల మరియు మిగిలిన వారిలో సీనియర్ సభ్యులకు తక్కువ సర్వీస్ ఉండటం వలన లోన్ ష్యూరిటీలు దొరకటం కష్టం అవుతున్నందున సభ్యుల కోరిక పై ష్యూరిటీ పరిమితిని పెంచడం గూర్చి)
Discussion on proposed Bye-law amenment for approval. (To enhance members surity limit)
10. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సంఘ సభ్యుల జీతం నుండి రికవరీ చేసిన మొత్తాలు సంఘానికి అలస్యంగా చెల్లించడం మరియు సంఘ సభ్యుల ఋణ వాయిదాలను జీతం నుండి రికవరీ చేయకపోవడం పై చర్చ.
Discussion on late remittance of members salary rocoveries to the society and not recovering of members loan EMIs from their salary by VSP Management
11. అధ్యక్షులవారి అనుమతితో ఇతర అంశములపై చర్చించుట.
Any other matter with the permission of the Chairman

కావున గౌరవ సభ్యులందరూ తప్పనిసరిగా మహాజన సభకు హాజరై సభను జయప్రదం చేయవలసిందిగా కోరుచున్నాము.

Full details available in "THRIFT WEBSITE " పూర్తి వివరాలు థ్రిఫ్ట్ వెబ్ సైట్‌లో లభ్యమగును.

ఉక్కునగరం
తేది.05-09-2025

D.S.R.C. MURTHY
Secretary

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -మధురవాడ : ఎపి అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ సౌజన్యంతో ఆనంద్ తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో శిల్పారామంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలను శనివారం స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జ్యోతిప్రజ్వలన చేసి బౌట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రాచీన యుద్ధకళల్లో ఒకటైన తైక్వాండో నేర్చుకోవడం ద్వారా ఆరోగ్యంతోపాటు ఆత్మరక్షణకు దోహదపడుతుందన్నారు. బాలికలు తైక్వాండో నేర్చుకోవాలని సూచించారు. అమెచ్యూర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గ్రాండ్ మాస్టర్ బాబూరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలకు ఆతిథ్యమిస్తున్న ఆనంద్ తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ అధినేతను అభినందించారు. రెండు రోజుల పోటీల్లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, కాకినాడ, పశ్చిమగోదావరి ఎన్టీఆర్, ప్రకాశం నెల్లూరుచ చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం జిల్లాలకు చెందిన 200 మంది క్రీడాకారులు పాల్గొంటుండగా, చెన్నైకి చెందిన అంతర్జాతీయ తైక్వాండో పోటీల రిఫరీ సుదర్శన్ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

పిఎం పాలెం వాకర్స్ క్లబ్, 20 20 అసోసియేషన్ అధ్యక్షులు బాబ్జి, కార్పొరేటర్లు గంటా నూకరాజు, మొల్లి హేమలత, కూటమి నేతలు ఉప్పాడ అప్పారావు, శాఖరి శ్రీనివాస్, మొల్లి లక్ష్మణరావు, కార్యదర్శి పిల్లా వెంకట్రావు,నాగోతి సత్యనారాయణ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలను ప్రారంభించి, తిలకిస్తున్న ఎమ్మెల్యే గంటా

రూ.1.72 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జివిఎంసి ఆరోవార్డు వైభవ్‌నగర్‌లో రూ.1.72 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ పనులకు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, మధురవాడలో రూ. వెయ్యి కోట్లతో రెండు కీలకమైన ప్రాజెక్టులు మొదలు కాబోతున్నాయన్నారు. రూ.535 కోట్ల ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సి) నిధులతో 38 ఎంఎల్‌డి. సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు.. 400 కిలోమీటర్ల పొడవునా సీవేజ్ లైన్ నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. ఇందులో రూ.498 కోట్లు ఐఎఫ్‌సి. ఇస్తుండగా, మిగిలిన మొత్తాన్ని జీవిఎంసీ భరిస్తుందన్నారు. మధురవాడలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.500 కోట్లతో భారీ ప్రాజెక్టుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఇవేకాక రూ. 120 కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు తదితర మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. భీమిలిలో ప్రధానమైన మూడు రోడ్ల విస్తరణ, జివిఎంసిలో భీమిలి రూరల్, ఆనందపురం, పద్మనాభం మండలాల విలీనం ప్రతిపాదనలు తొందర్లోనే కార్యరూపం దాల్చనున్నాయని వెల్లడించారు. దీనిపై జిల్లా కలెక్టర్, జివిఎంసి, విఎంఆర్‌డిఎ కమిషనర్లతో మున్సిపల్ మంత్రి పి. నారాయణ సమావేశం కానున్నారన్నారు.

ఈ సందర్భంగా వైసిపి హయాంలో హయాంలో ఆ పార్టీ నేతలు వైభవ్‌నగర్‌లో రెండు పార్కుల గేట్లకు తాళాలు వేసిన విషయమై స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తేగా, ఎమ్మెల్యే గంటా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే తాళాలు తీసి, నిర్వహణ బాధ్యతను కాలనీ అసోసియేషన్‌కు అప్పగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్‌స్ కనక మహలక్ష్మి, భీమిలి ఎంపిపి ఛైర్మన్ కురుమిన రామస్వామి నాయుడు, కార్పొరేటర్లు మొల్లి హేమలత, లొడగల అప్పారావు, దాసరి శ్రీనివాస్, గంటా నూకరాజు, శాఖారి శ్రీనివాస్, పిల్లా వెంకట్రావు, కె.అచ్యుతరావు, నాగోతి సత్యనారాయణ, మామిడి దుర్గారావు, మొల్లి లక్ష్మణరావు, చెట్టుపల్లి గోపి, బోయి రమాదేవి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ప్రజాశక్తి -గాజువాక : రోడ్డు ప్రమాదంలో మహిళా దుర్మరణం చెందిన ఘటన గాజువాక జగ్గు సెంటర్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలివి. చైతన్యనగర్‌కు చెందిన పి.విజయలక్ష్మి (60). శనివారం ఉదయం తన కూతురు స్కూటీపై జగ్గు సెంటర్ నుండి వైజంక్షన్ వైపు వెళుతుండగా మార్గమధ్యంలో ముందున్న గుయ్యి తప్పిస్తుండగా, వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో రోడ్డుపై పడిన విజయలక్ష్మి తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వృద్ధునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. మనబాలవానిపాలెం జంక్షన్ వద్ద అచ్యుతాపురానికి చెందిన కర్రి అప్పారావు రోడ్డు దాటుతుండగా నక్కపల్లి నుండి తుని వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో అప్పారావుకు తీవ్రగాయాలుకాగా, స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డు ఐఎన్ స్ కళింగ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి.పోలీసుల కథనం ప్రకారం.. రాజమండ్రికి చెందిన నితీష్, మౌళి సాగరనగర్‌లోని ప్రైవేట్ కళాశాలలో చదువుతున్నారు. శుక్రవారం రాత్రి బీచ్ రోడ్డులో కారులో వెళుతుండగా, ఐఎన్ఎస్ కళింగ వద్ద డివైడర్‌ను ఢీకొట్టి, పొదల్లోకి దూసుకెళ్లారు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జుకాగా, కారులోని భద్రతా బెలూన్లు తెరుచుకోవడంతో ఇద్దరు విద్యార్థులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వీరిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు . పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కారు ప్రమాదానికి గురైన ఇద్దరు విద్యార్థులు మద్యం మత్తులో ఉన్నట్టు సమాచారం.

81 మంది మందుబాబులకు జరిమానా

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 81 మంది మందుబాబులకు ఒక్కొక్కరికీ రూ.పది వేలు చొప్పున జరిమానా విధిస్తూ శనివారం భీమిలి 15 వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ పి. స్వాతి భవానీ తీర్పు చెప్పారని స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు కారణమౌతున్న ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, డ్రంకెన్ డ్రైవ్‌పై ప్రత్యేక నిఘాపెట్టి, నిరంతరం తనిఖీలు చేస్తామన్నారు. పట్టుబడితే కేసులు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థి ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి- భీమునిపట్నం : కాలేజీకి వెళ్తకుండా స్నేహితుని ఇంటికి వెళ్లిన ఇంటర్ విద్యార్థి ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. సిఐ బి తిరుమలరావు కథనం ప్రకారం..విశాఖ నగరంలోని ఓ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్‌ఫస్టియర్ చదువుతున్న కె నగరపాలెం విద్యార్థి కురందాసు చిన్మయానంద్ శుక్ర వారం ఇంటిలో తల్లిదండ్రులకు చెప్పి కాలేజీకి వెళ్లాడు. అయితే కళాశాలకు రాలేదని కళాశాల ప్రిన్సిపాల్ నుంచి ఫోన్ రావడంతో ఆందోళన చెందిన విద్యార్థి తల్లిదండ్రులు విద్యార్థి ఆచూకీ కోసం వాకబ్ చేసినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ ఎన్ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేపట్టి, గొవు పేటలోని స్నేహితుని ఇంటి వద్ద చిన్మయానంద్ ఉన్నట్టు గుర్తించి, స్టేషన్‌కు తీసుకొచ్చి తల్లిదండ్రులు మీనాక్షి, రామలకు అప్పగించారు.

యుజిడి పనులకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి పదోవార్డు ఆదర్శనగర్ కొండవాలు ప్రాంతంలో రూ.36లక్షలతో యుజిడి పనులకు శనివారం స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మితో కలిసి శంకుస్థాపన చేసారు. కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి మద్దిల రాజేష్, బిజెపి అధ్యక్షులు దొంతల రమణ, బుగత తాతారావు, చోడుగంజి అప్పలనాయుడు, కాళ్ళ అప్పారావు, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా బాలోత్సవం

ప్రజాశక్తి-పెందుర్తి: విద్యార్థులలో దాగి వున్న సృజనాత్మక, కళాత్మక విలువలను ప్రదర్శించడానికి బాలోత్సవం మంచి వేదిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్, పెందుర్తి బాలోత్సవం గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక పాలిటెక్నిక్ కాలేజీలో విశాఖ బాలోత్సవం ఆధ్వర్యంలో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వాలంటీర్ల బృందం, ఎం.శశికుమార్ నేతృత్వంలో పెందుర్తి బాలోత్సవం ప్రారంభించారు. తొలిరోజున చిన్నారులకు చిత్రలేఖనం, కథలు, కవితలు రాయడం, వ్యాసరచన వంటి అకడమిక్ పోటీలతో పాటు శాస్త్రీయ, జానపద నృత్యం, జానపద అభ్యుదయ గీతాలాపన, ఏకపాత్రాభినయం, ఫాన్సీ డ్రెస్ వంటి 23 అంశాల్లో పోటీలు నిర్వహించారు.విశాఖ బాలోత్సవం కార్యదర్శి జీఎస్.రాజేశ్వరరావు మాట్లాడుతూ బాలోత్సవ నిర్వహణకు సహకరించిన పాలిటెక్నికల్ కాలేజీ ప్రిన్సిపల్, ఇతర యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నారి కళాకారులకు జ్ఞాపికలు అందజేస్తున్న నిర్వాహకులు

కార్యక్రమంలో గురజాడ సాంస్కృతిక వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు, పెందుర్తి బాలోత్సవం అధ్యక్షులు పివి. రమణ , కార్యదర్శి ఎ.చంద్రశేఖర్, కోశాధికారి ఉప్పాడ రాము, కార్యదర్శి ఎల్లాజీ, షార్ట్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ పాల్గొన్నారు.పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఇతర రాష్ట్రాల కార్మికుల అడ్డగింత

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్టు కార్మికుల స్థానే పనిచేసేందుకు ఉక్కు యాజమాన్యం తీసుకొచ్చిన ఇతర రాష్ట్రాల కార్మికులను స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో శనివారం అడ్డుకున్నారు. ఈసందర్భంగా స్టీల్ సిఐటియు నేతలు మాట్లాడుతూ, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఉక్కు కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఐక్య సంఘం ఆధ్వర్యంలో సేఫ్టీ ఆఫీసు వద్ద నాలుగు రోజులుగా ఆందోళన చేస్తుంటే, పట్టించుకోకుండా, ఒడిశా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, బీహార్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చి పనికల్పించడం దుర్మార్గమన్నారు. ఎన్నోఏళ్లుగా పనిచేసిన అనుభవం ఉన్న స్థానిక కాంట్రాక్టు కార్మికులను తొలగించి, ఇతర రాష్ట్రాల కార్మికులను పనిలో పెట్టుకోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవడంతోపాటు స్థానిక నిర్వాసితులకు కాంట్రాక్టు కార్మికులుగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉక్కు యాజమాన్యం స్పందించి, తమ డిమాండ్లను నెరవేర్చే వరకు ఆందోళనను కొనసాగిస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో సిఐటియు ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, డిపి యూనియన్ భాస్కరరావు, యుఎన్ఇ నాయకులు పరంధామయ్య ఐఎన్‌టియుసి నేత వంశీకృష్ణ, హెచ్ఎంఎస్ కోన రమణ, సంజీవ్, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

సైబర్ మోసాల ఉచ్చులో విద్యార్థులు

ప్రజాశక్తి గాజువాక : యువత, విద్యార్థులపై ఆన్‌లైన్, సైబర్ మోసాల ముప్పు రోజురోజుకూ పెరుగుతోందని, దీనిపై అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని స్థానిక పోలీస్‌స్టేషన్ శాంతిభద్రతల సిఐ పార్థసారధి అన్నారు. శనివారం బజాజ్ ఫైనాన్స్, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ, బజాజ్ ఫిన్‌సర్వ్ ఆధ్వర్యంలో శ్రీనగర్ టిఎస్ఆర్ టిబికె కాలేజీలో విద్యార్థులకు 'నాకౌట్ డిజిటల్ ఫ్రాడ్' పేరుతో సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. నకిలీ ఒటిపి, ఫిషింగ్ దందాలు, డిజిటల్ అరెస్టులు, ఆర్థిక రుణం, తదితర ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు., అనుమానాస్పద లింకులను ఎషేర్ చేయవద్దని హెచ్చరించారు. సైబర్ క్రైమ్ సిఐ రవికిషోర్, మాట్లాడుతూ, సోషల్ మీడియాలో యువత అధికంగా పాల్గొనడం కూడా సైబర్ మోసాల కారణమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

'అవంతి'లో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి - తగరపువలస : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 8న ప్రారంభమైన వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. సాంకేతిక విద్యలో మెలకువలు నేర్చుకుని, భవిష్యత్‌లో ఎంచుకున్న సబ్జెక్ట్‌లో నైపుణ్యం ఎలా మెరుగుపర్చుకోవచ్చు అనే అంశాలపై అవగాహన కల్పించారు హెచ్ఎంఐఇఎస్ సంస్థ అధ్వర్యంలో నిర్వహించిన పిసిబి వర్క్ షాప్ లో 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ చంద్ర శేఖర్, ఇసిఇ విభాగాధిపతి జి అనంతరావు, అధ్యాపకులు పాల్గొన్నారు

కమనీయంగా అప్పన్న నిత్య కల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం సింహాద్రి అప్పన్న ఆర్జిత సేవల్లో భాగంగా శనివారం స్వామి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేసి .భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్ర ఆగమశాస్త్ర విధానంలో జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలతో కల్యాణతంతును కమనీయంగా జరిపించారు. వేడుకలో భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామి ప్రసాదాలను అందజేశారు. అంతరాలయ దర్శనం కల్పించారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ప్రజాశక్తి- తగరపువలస : చిట్టివలస జెడ్‌పి హైస్కూల్‌లో ఎన్ఎంఎంఎస్‌లో ఉచిత శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం వ్యక్తిత్వ వికాసంపై డాక్టర్ ఎంఏఆర్ రాజు అవగాహన కల్పించారు. విద్యార్థుల ప్రవర్తన, చదివిన విషయాలను గుర్తించుకోవడం, క్రమశిక్షణ, సమయ పాలన, సామూహిక చర్చ, క్రోడీకరణ, విశ్లేషణ, క్రీడలు, అత్యుత్తమ వ్యక్తుల జీవిత విశేషాలు చదవడం, నేర్చుకోవడం తదితర అంశాలపై వివరించారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు గంటన మోహన రావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, గౌరవాధ్యక్షులు జివి అప్పారావు, విషయ నిపుణులు జి చిన్నయ్య, హెచ్ఎం, దొడ్డి ఆదినారాయణ పాల్గొన్నారు.

బాలికలకు ఉచిత కేన్సర్ వ్యాక్సినేషన్

లయన్స్ క్లబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వ్యాక్సిన్ వేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- సీతమ్మధార: సీతమ్మధారలోని లయన్స్ కేన్సర్ ఆసుపత్రిలో విశాఖపట్నం లయన్స్ క్లబ్ ఆఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 9 - 14 ఏళ్ల బాలికలకు శనివారం గర్భకోశ ముఖద్వార కేన్సర్ నియంత్రణకు ఉచిత వ్యాక్సినేషన్ చేశారు. ఈనెల 13 నుండి 16 వరకు టీకాలు వేయాల్సి ఉండగా, 670మంది పేర్లు నమోదు చేసుకోగా, తొలి రోజునే 300 మందికి బాలికలకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు, చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షిరీన్ రహమాన్ మాట్లాడుతూ ఆడపిల్లల్లో కేన్సర్ నియంత్రణ వ్యాక్సినేషన్ శిబిరానికి మంచి స్పందన వచ్చిందన్నారు. ఆరు నెలల వ్యవధిలో రెండు డోసులు వ్యాక్సిన్ వేస్తున్నామని, ఇది ఖర్చుతో కూడుకున్నప్పటికీ, సామాజిక సేవా దృక్పథంతో ఉచితంగా వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో లయన్స్ కేన్సర్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు, ట్రస్ట్ కార్యదర్శి రవిచంద్ర, డాక్టర్ శరత్ పాల్గొన్నారు.

198 మందికి కంటి పరీక్షలు

రోగులకు నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక నీడీ వెల్ఫేర్ అసోసియేషన్, సన్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యశాల సౌజన్యంతో శనివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 198 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 40 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేయగా, దృష్టిలోపం ఉన్న 34 మందికి ఉచితంగా కళ్లద్దాలు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సన్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన వైద్యశిబిరంలో నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె శ్రీనివాస్, సభ్యులు ఎం సూర్య శ్రీనివాస్, వి శ్రీనివాస రెడ్డి, వి సతీష్, శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్య శాల వైద్యులు డి కృష్ణ దీపక్, క్యాంప్ కోఆర్డినేటర్ పైడిరాజు, సిబ్బంది పాల్గొన్నారు

విద్యార్థులకు స్టీల్ కంచాల పంపిణీ

స్టీల్ కంచాలు అందజేస్తున్న శ్రీరామ్మూర్తి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్విర్ల శ్రీదేవి ఫౌండేషన్ ఆర్థిక సాయంతో అల్లూరి జిల్లా అనంతగిరి మండలం, నక్కుల మామిడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు 40 భోజన కంచాలను ఫౌండేషన్ చైర్మన్ కె శ్రీరామచంద్రమూర్తి శనివారం అందజేశారు. ఫౌండేషన్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో యుటి ఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు, పాఠశాల ఉపాధ్యాయులు జి గోవిందరావు, యు రాంబాబు, లక్ష్మణరావు పాల్గొన్నారు

అడుగడుగునా నీటికుంటలు!

- అనునిత్యం అవస్థలు పడుతున్న వాహనదారులు
- ఏళ్ల తరబడి ఇదే దుస్థితి.. అయినా పట్టని అధికారులు
- ఇదీ గాజువాక వై.జంక్షన్- స్టీల్‌ప్లాంట్ రోడ్డు దుస్థితి

వైజంక్షన్ నుంచి స్టీల్‌ప్లాంట్‌లో వెళ్లే రోడ్డులోని భారీ గోతులు

ప్రజాశక్తి- గాజువాక : జివిఎంసి గాజువాక జోన్ పరిధి వై జంక్షన్ నుంచి స్టీల్ ప్లాంట్‌కు వెళ్లే ప్రధాన మార్గంలో దుర్గానగర్ వద్ద రహదారి నిండా గోతులమయమైంది. రోడ్డు పొడుగునా అడుగడుగునా ఉన్న భారీ గోతుల్లో వర్షపునీరు చేరడంతో నీటి కుంటలను తలపిస్తున్నాయి. ఈ మార్గంలో నిత్యం వంద లాది వాహనాలు, వేలసంఖ్యలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, విద్యార్థులు, స్థానిక ప్రజలతోపాటు అనేకమంది వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. గోతులమయమైన రోడ్డులో వీరు అనునిత్యం పడే అవస్థలు అన్నీఇన్నీకావు. మోకాలిలోతుకు మించిన గోతులు రోడ్డు ఎంత వెడల్పు ఉందో, అంతస్థాయిలో ఏర్పడి, దానిలో నీరు నిండడంతో వాటిలో దిగి వెళ్లడం వాహనదారులకు ప్రాణసంకటమే. అలాగని పక్కనుంచి వెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి. దుర్గానగర్ వద్ద వారం, నెలలు కాదు, ఏకంగా ఏడాదికి పైగాఇదే పరిస్థితి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నీటి కుంటలను తలపిస్తున్న రోడ్డు

దుర్గానగర్ కూడలి నుంచి సిఎఫ్ఎల్‌కు వెళ్లే భారీ వాహనాలు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారిలోనే సుందరయ్య కాలనీ రైల్వే బ్రిడ్జి వద్ద రోడ్డు మధ్యలో ఏర్పడిన పెద్దగోతుల్లోనూ నీరు నిలిచి అవిసైతం కుంటలను తలపిస్తున్నాయి. చిన్న వర్షం పడినా రోడ్డుపైనే నీరు నిలిచిపోతుండగా, వర్షాలు లేకున్నా, వాహనాలు దిగితే వాటి బాడీలు నేలను ఆనుకునే స్థాయిలో ఉన్న ఈ గోతుల్లో అన్ని సీజన్లలోనూ వాహనదారులు అవస్థలు పడాల్సిన దుస్థితి, ఇక బైకిస్టులైతే, ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గత్యంతరం లేని పరిస్థితుల్లో ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తు న్నారు. శాశ్వతప్రాతిపదికన రోడ్డు పునర్నిర్మాణం పక్కన పెడితే, తక్షణమే ఈ రహదారిలోని భారీ గోతులకు మరమ్మతులు చేపట్టి, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

పేదల వైద్యానికి అధిక ప్రాధాన్యత

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పల్లా

ప్రజాశక్తి- గాజువాక : పేదలకు మెరుగైన వైద్యసేవల కల్పనకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని స్థానిక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. శనివారం జివిఎంసి 75వ వార్డు పెద గంట్యాడ పిహెచ్‌సిలో రూ.50లక్షలతో నిర్మించిన ల్యాబొరేటరీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పెదగంట్యాడ పిహెచ్‌సిని 30పడకల సిహెచ్‌సి స్థాయికి అతిత్వరలో పెంచనున్నట్లు తెలిపారు. వార్డు పరిధిలో రూ.1.60కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. త్వరలో బిసి రోడ్డు విస్తరణ, పెదగంట్యాడ శ్మశానవాటిక అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో గాజువాక జెడ్‌సి శేషాద్రి, టిడిపి విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు పులి వెంకటరమణారెడ్డి, స్థానిక వార్డు టిడిపి అధ్యక్షులు నమ్మి అప్పారావు, జనసేన అధ్యక్షులు కోన చిన అప్పారావు, నేతలు ముసిరి శ్రీనివాస రావు, పెద్దాడ సోమునాయుడు, నూకరాజు, వరలక్ష్మీ, కణితి సన్యాసమ్మ, బస అప్పలరెడ్డి, పుష్ప, ములకలపల్లి వంశీ, మొల్లి అప్పారావు, ఉరుకూటి అప్పారావు, పాల్గొన్నారు.

రూ.3కోట్లతో వికాస్‌నగర్ రోడ్డు విస్తరణ, పునర్నిర్మాణం

జివిఎంసి 65వ వార్డు, బిసి రోడ్డు యాక్సిస్ బ్యాంకు కూడలి నుంచి వికాస్‌నగర్ రాజీవ్ ఇండోర్ స్టేడియం వరకు రూ.3కోట్లతో చేపట్టనున్న తారురోడ్డు విస్తరణ, పునర్నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ బొడ్డ నరసింహ పాత్రుడుతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రోడ్డు విస్తరణ, అభివృద్ధికి స్థానికుల వినతి మేరకు 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేసి పనులు చేపడుతున్నట్లు తెలిపారు వార్డు టిడిపి అధ్యక్షుడు రట్టి వాసు, కూటమి నేతలు బైపిల్లి గాంధీ, అంగ కృష్ణ, సింగంపల్లి దేముడు, దాట్ల శ్రీనివాసరాజు, రెయ్యి రత్నం, కర్రి కృష్ణ, జగదీష్, వెంకటేశ్వరరావు, చిన్నా, ఇల్ల శివ, అప్పలరాజు, సుజాత, ఉమ, కాకి స్వరూపారాణి, రట్టి జయమ్మ, మంగ, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

ప్రజాశక్తి- పెందుర్తి: నియోజకవర్గ పరిధిలో ప్రజాసమస్యలను గుర్తించి పరిష్కరించడమే లక్ష్యంగా మార్నింగ్ వాక్ విత్ పబ్లిక్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. శనివారం ప్రహ్లాదపురంలో పర్యటించి, ప్రజాసమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇళ్లపైనుంచి విద్యుత్ వైర్లు, శిథిల డ్రైనేజీలు, రోడ్డు మధ్యలో విద్యుత్‌స్తంభాల మార్పు, పాడైన కల్వర్టు పునర్నిర్మాణం, శిథిలమైన వాటర్‌ట్యాంకు తొలగింపు, రేషన్‌డిపో ఏర్పాటు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికితేగా, వాటి పరిష్కారంపై తక్షణ చర్యలకు నివేదిక ఇవ్వాలని జెడ్‌సి, ఇతర అధికారులతోపాటు కార్పొరేటర్‌కు సూచించారు. కార్యక్రమంలో జివిఎంసి ఇఇ దిలీప్ డిఇఇ ప్రవీణ్, ఎఇ కుసుమ, వార్డు అధ్యక్షుడు ఆదివాబు నాయకులు రాపర్తి శైలజకన్నా, కోరుకొండ వరహాలు, దాసరి శ్రీనివాసరావు, మాధవ, వరహాలు, ఉషా రాణి, బలిరెడ్డి శ్రీను, పల్లా రవి, మహేష్,సేనాపతి సోమశేఖర్, రాపర్తి కిషోర్ పాల్గొన్నారు.

ప్రజాకవి ఆరుద్ర

- శతజయంతి వేడుకలో పలువురు వక్తలు

ఆరుద్రకు నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు, నిర్వాహకులు

ప్రజాశక్తి- సీతమ్మధార : కళ ప్రజల కోసమని నమ్మిన వ్యక్తి ప్రజాకవి ఆరుద్ర అని రచయిత విమర్శకులు మేడిపల్లి రవికుమార్‌అన్నారు. శనివారం పౌర గ్రంథాలయంలో సాహిత్య అకాడమీ, రైటర్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యాన భాగవతుల సదాశివ శంకర శాస్త్రి (ఆరుద్ర) శతజయంతి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కీలక ఉపన్యాసం చేసిన రవికుమార్ మాట్లాడుతూ, విశాఖలో జమిందారీ కుటుంబంలో పుట్టిన ఆరుద్ర, తాను. కవిత కోసం పుట్టానని, సామాజిక క్రాంతి కోసం కలం పట్టానని అన్నారన్నారు. ఇంట్లో మేనమామ వరసైన మహాకవి శ్రీశ్రీ , కుటుంబం ప్రభావం ఆరుద్రపై ఉందన్నారు. సమాజానికి చరిత్ర, పురోగతి ఉంటుందని శ్రీశ్రీ చెప్పారని, అది ఆరుద్ర పాటించారన్నారు. ఇంటి పేరు, కులం పేరు వదులుకొని తనను తాను ఆరుద్ర నిరూపించుకున్నారని కొనియాడారు. సైన్స్ అభివృద్ధి చెందుతుందని, దాన్ని సమాజాభివృద్ధికి అన్వయించాలని భావించే ఆరుద్ర, మొదటి నుంచి శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకుని పాటించారని, సమాజంలో శ్రామిక వర్గం వైపు నిలబడ్డారన్నారు. సమాజం పట్ల నిబద్ధత గల వ్యక్తి ఆరుద్ర అని కొనియాడారు. రష్యాలో సోషలిజం పతనమైనా, చివరి వరకు మార్క్సిజాన్ని వదిలిపెట్టని ఆరుద్ర, ఎవరెన్ని కుట్రలు చేసినా మార్క్సిజానికి ప్రమాదం లేదని నమ్మేవారన్నారు. సాహిత్య అకాడమీ కన్వీనర్ సి.మణాళిని స్వాగతోన్యాసం చేస్తూ ఆరుద్ర లాంటి కవుల శత జయంతి వేడుకల నిర్వహణ ద్వారా నేటి తరానికి తెలియజేసే అవకాశం దక్కడం ఆనందంగా ఉందన్నారు సదస్సుకు అధ్యక్షత వహించిన రైటర్స్ అకాడమీ అధ్యక్షులు వివి రమణమూర్తి మాట్లాడుతూ యువతకు సామాజిక అవగాహన ఉండాలని, కర్ణాటక తరహాలో ఇక్కడి పాఠశాలల్లోనూ విద్యార్థులకు అటువంటి ప్రోత్సాహం అవసరమన్నారు. మేడా మస్తాన్ రెడ్డి వాఖ్యాతగా వ్యవహరించిన సదస్సులో గాంధీ సెంటర్ కార్యదర్శి వి బాలమోహన్‌దాస్, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ ఎస్ రఘు, రచయితలు తలతోటి పృథ్విరాజు, అయ్యగారి సీతారత్నం, ఆచార్య బాబీ వర్ధన్, అనిల్ డ్యానీ, రాంబట్ల నృసింహశర్మ, బాల సుధాకర్‌మౌళి, చింతకింది శ్రీనివాసరావు, బులుసు వెంకటేశ్వర్లు, కెవిఎస్ మూర్తి, అనురాధ, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

హాసిని మరణంపై సమగ్ర విచారణ చేపట్టాలి

ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా, సిఐటియు నేతల డిమాండ్

బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి-కోటవురట్ల : నర్సీపట్నం మండలం వేములపూడి బాలికల హాస్టల్‌లో 8వ తరగతి చదువుతున్న హాసిని మరణంపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మాకవరపాలెం మండలం బూరుగుపాలెం గ్రామంలో హాసిని కుటుంబ సభ్యులను శనివారం ఆయా సంఘాల నాయకులు కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు, హాస్టల్ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగానే హాసిని మరణించిందని, సకాలంలో వైద్యం అందించినట్లయితే హాసిని మరణించేది కాదని కుటుంబ సభ్యులు వాపోయారు. కడుపునొప్పి వస్తుందని హాస్టల్ వార్డెన్‌తో చెప్పినా హాస్పిటల్‌కు తీసుకు వెళ్లకుండా ఓఆర్ఎస్ ఇచ్చి తగ్గిపోతుందిలే అని చెప్పి నిర్లక్ష్యం చేయడం వల్లే తమ కుమార్తె చనిపోయిందని మృతురాలి తల్లి నాగమణి ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం హాస్టల్ వార్డెన్ సిబ్బంది ఎవరు కూడా తమకు సమాచారం ఇవ్వలేదన్నారు. గురువారం రాత్రి అంతా కడుపు నొప్పితో బాధపడితే శుక్రవారం ఉదయం తమకు ఫోన్ చేసి మీ అమ్మాయికి బాగోలేదు హాస్పిటల్‌కు తీసుకు వచ్చాం రండి అని చెప్పారని తెలిపారు. తాము వెళ్లేసరికి పాప అపస్మారక స్థితిలో ఉందని, అనకాపల్లి హాస్పిటల్‌కు తీసుకువెళ్లగా అప్పటికే పాప చనిపోయినట్లు డాక్టర్లు తెలిపారని వాపోయారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హాసిని మరణంపై జిల్లా కలెక్టర్ స్వయంగా విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో బహిరంగ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, బాలిక కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పి.విజయ్ కుమార్, డివిజన్ నాయకులు ఏం సత్యనారాయణ, వై జనార్ధన్, మణి, మోహన్ సాయి, ఐద్వా జిల్లా కోశాధికారి కెవి సూర్యప్రభ, సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, చిరంజీవి పాల్గొన్నారు.

హాసిని కుటుంబానికి న్యాయం చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

అనకాపల్లి : హాసిని కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ అనకాపల్లి జిల్లా గర్ల్స్ కన్వీనర్ వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. అనకాపల్లిలో శనివారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్లో బాలికలకు సరైన వంటి రక్షణ, మౌలిక వసతులు లేకపోవడం వల్ల ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీత, రాధా, యోగిత, భవాని, భాగ్యశ్రీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

రక్తదానం చేస్తున్న డెక్కన్ ఉద్యోగులు

మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-పాయకరావుపేట : మండలంలో కేశవరం వద్ద గల డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం శనివారం జరిగింది. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలను ఆదుకోవాలనే సంకల్పంతో ఈ రక్తదాన శిబిరం నిర్వహించారు. డెక్కన్ కంపెనీ టెక్నికల్ డైరెక్టర్ కెవిఎల్పి రాజు, వైస్ ప్రెసిడెంట్ పివిఎస్ఎస్ రాజు ఆధ్వర్యంలో తుని మమత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వహణలో, మదర్ బ్లడ్ బ్యాంక్, వైయస్ఆర్ బ్లడ్ బ్యాంకులతో కలిసి ఈ మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. డెక్కన్ కంపెనీ ఉద్యోగులు సుమారు 200 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

స్టెమ్‌తో ప్రపంచంలో కెరీర్ అవకాశాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్టెమ్ ద్వారా ప్రపంచ స్థాయిలో కెరీర్ అవకాశాలు లభిస్తున్నట్లు మహిళ శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి ఎన్ఎన్ సూర్యలక్ష్మి అన్నారు. సంకల్ప్ ప్రోగ్రాంలో భాగంగా సైన్స్ కేంద్రాలు, పరిశోధనా ప్రయోగశాలల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం స్థానిక ఏఎంఎఎల్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టెమ్ అంటే సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ అని, ఈ రంగాలు సహజ భౌతిక ప్రపంచ అధ్యయనం, సాంకేతిక పురోగతులు, సాధనాలు, ప్రక్రియల సృష్టి, పరిమాణాత్మక తార్కికంపై దృష్టి పెడతాయని తెలిపారు. పెరుగుతున్న ఉద్యోగ మార్కెట్లు, అధిక సంపాదనా సామర్థ్యం, ప్రపంచ కెరీర్ అవకాశాలతో సంబంధం కలిగి ఉండటం, ఆచరణాత్మక, సమస్య పరిష్కార నైపుణ్యాలను నొక్కి చెప్పడం వల్ల స్టెమ్ డిగ్రీలు ప్రజాదరణ పొందుతాయని వివరించారు. ఇటువంటి కార్యక్రమాలకి మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా అందించే సహాయ సహకారాలు గురించి తెలియజేశారు. అనంతరం కాలేజీ కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ ల్యాబ్‌లను విద్యార్థులతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి జయబాబు, సూపరింటెండెంట్ అనురాధ, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ సామ్రాజ్యం, వన్ స్టాప్ సెంటరు కార్యనిర్వహణ అధికారి కెయంవి. మంజుల వాణి, ప్రొటెక్షన్ ఆఫీసర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండల కేంద్రంలోని మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కందుల వెంకటేశ్వరావు, నాయకులు కొమ్మిరెడ్డి నాగలక్ష్మి, కందుల నాగేశ్వరరావు, కర్రి శ్రీను, అప్పారావు, సత్యనారాయణ, నాగసూరి, అంజి మోహన్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌల్ట్రీ యజమానులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని మారేపల్లి శివారు చేనులపాలెం సమీపంలో రైవాడ కాలువలోనూ, చెరువుల్లోనూ చనిపోయిన కోళ్లను వేసిన పౌల్ట్రీ యజమానులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేశారు. చనిపోయిన కోళ్లు కుప్పలు తెప్పలుగా పడి ఉన్న కాలువ, చెరువు ప్రాంతాన్ని శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం వెంకన్న విలేకరులతో మాట్లాడుతూ పంటపోలాలు మధ్యలో ఉన్న కాలువలోనూ, చెరువులోనూ చనిపోయిన కోళ్ళను రాత్రి సమయంలో తీసుకువచ్చి వేయడం వలన చుట్టు పక్కల కళ్ళాలు వారు, పొలాలు వచ్చేవారు దుర్వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికే చేపలు చెరువుల్లో చికెన్, పశు మాంసం కుళ్ళిన వ్యర్థాలను వేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనికి తోడు పౌల్ట్రీ యజమానులు బరితెగించి ఇటువంటి ఘాతుకానికి పూనుకున్నారని తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులు చొరవ తీసుకొని వెంటనే చనిపోయిన కోళ్ళ వ్యర్థాలను తొలగించి ప్రజలు ప్రాణాలు కాపాడాలని వెంకన్న డిమాండ్ చేశారు.

ఎంఎంసి డైరెక్టర్‌గా షణ్ముఖరాజు

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని రాజుపాలెం పంచాయతీ సిరసపల్లి గ్రామానికి చెందిన సిరసపల్లి షణ్ముఖరాజును అనకాపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ, 84వ వార్డు ఇన్‌ఛార్జి మాదంశెట్టి నీలబాబు, మాజీ ఎంపీటీసీ సిరసపల్లి సన్యాసిరావు, కూటమి ముఖ్య నాయకులు షణ్ముఖరాజుకు అభినందనలు తెలియజేశారు.

రోడ్డు విస్తరణ నిర్వాసితులందరికీ న్యాయం చేస్తాం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అనకాపల్లి నుంచి అచ్చుతాపురం వరకు రహదారి విస్తరణలో నష్టపోయిన నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ చెప్పారు. హరిపాలెం గ్రామంలో శనివారం రహదారి విస్తరణలో భూములు, పక్కా భవనాలు కోల్పోయిన నిర్వాసితులకు టిడిఆర్ బాండ్లు అంగీకార పత్రాలను ఎమ్మెల్యే విజయ్ కుమార్ చేతుల మీదుగా తహశీల్దారుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జనపరెడ్డి శ్రీనివాసరావు, జనసేన మండల అధ్యక్షులు బి.రాందాస్, నాయకులు కాండ్రేగుల సూర్యనారాయణ, కాండ్రేగుల అప్పారావు, కే జోగినాయుడు, సిపిఎం నాయకులు కె.రామ సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

అంగీకార పత్రాలను తహశీల్దారుకు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సొంతగూటికి ఎంపిపి మళ్ల జయలక్ష్మి

ధర్మశ్రీ ఆధ్వర్యాన వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-మునగపాక : మునగపాకకు చెందిన ఎంపీపీ మళ్ల జయలక్ష్మి సొంతగూటికి చేరారు. కొండకర్ల గెస్ట్ హౌస్‌లో శనివారం వైసిపి యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ సమక్షంలో ఆమె వైసిపిలో చేరారు. గతంలో వైసిపి ఎంపీటీసీగా గెలిచి ఎంపీపీ అయిన జయలక్ష్మి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జనసేన పార్టీలో చేరిన విషయం విధితమే. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి చేయాలనే దృక్పథంతో జనసేన పార్టీలో చేరడం జరిగిందని, కానీ ఆ పార్టీలో తనకు సరైన గుర్తింపు లేకపోవడం వలన తిరిగి తన మాతృ పార్టీ వైసీపీలో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు పెంటకోట స్వామి సత్యనారాయణ, లాలం రాము, అచ్యుతాపురం ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, వైసిపి మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, ఎంపీటీసీలు కాండ్రేగుల కిరణ్ కుమార్, శెరగడం జగన్నాథరావు, గోడకుర్తి గణేష్, బొడ్డేడు బుజ్జి, సర్పంచులు దొడ్డి వెంకట సూర్య అప్పారావు, మారిశెట్టి సూర్యనారాయణ, నర్మల కుమార్, నరాల శెట్టి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ధర్మశ్రీ సమక్షంలో వైసిపిలో చేరిన ఎంపిపి జయలక్ష్మి

నీరు కలిపిన పెట్రోల్ విక్రయం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండల కేంద్రంలోని పెట్రోల్ బంకులో నీరు కలిసిన పెట్రోల్ వినియోగదారులకు విక్రయించినట్లు శుక్రవారం వినియోగదారులు గుర్తించారు. కందిపూడి గ్రామానికి చెందిన కొప్పాక పైడిబాబు తన టీవీఎస్ ద్విచక్ర వాహనంలో శనివారం రెండు లీటర్ల పెట్రోల్ కొట్టించారు. కొద్ది దూరం వెళ్లిన వెంటనే వాహనం మొరాయించింది. వెంటనే మెకానిక్ వద్దకు తీసుకు వెళ్ళగా ఈ పెట్రోల్‌లో నీరు ఉన్నట్లు గుర్తించారు. ఆ పెట్రోల్‌ను వాటర్ బాటిల్‌లో నింపగా నీరు బాటిల్ అడుగున ఉండిపోగా, పెట్రోలు తేలింది. సదర బంకులో నాసిరకం పెట్రోల్ అమ్మకాలు చేస్తున్నారని వాహనదారులు వాపోతున్నారు. బంకు యాజమాన్యపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

బాటిల్‌లో పెట్రోల్ తేలిపోయి, నీరు అడుగున్న ఉన్న దృశ్యం

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలోని గుడివాడ గ్రామపంచాయితీ పరిధిలోని కొత్తపోలవరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గుడిమెట్ల అప్పలరాజు శస్త్ర చికిత్స చేసుకున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన లక్ష రూపాయల చెక్కును టీడీపీ మండల మాజీ అధ్యక్షులు నల్లపరాజు వెంకటరాజు శనివారం ఆయనకు అందచేశారు. కార్యక్రమలో పాకలపాటి గణపతిరాజు, మామిడి కృష్ణ, ధూళి రాజు, పాకలపాటి బంగార్రాజు, పాకలపాటి అప్పలరాజు, పాలవలస సత్యనారాయణ, వెంకటరమణ, పాల్గొన్నారు.

అధికారంతోనే బహుజనుల సాధికారత

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : బహుజనుల సాధికారత రాజ్యాధికారంతోనే లభిస్తుందని బిఎస్‌పి ఏపీ రాష్ట్ర అధ్యక్షులు గౌతమ్ కుమార్ పేర్కొన్నారు. అనకాపల్లి విజయా రెసిడెన్సీలో బహుజనుల సంకల్ప సభ శనివారం జరిగింది. అధికారం కలిగిన నాయకులు బడుగు బలహీన వర్గాలపై దాడులు చేస్తున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల వారు బహుజనులకు ఓటు వేసి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి కొల్లబత్తుల సత్యం, కార్యదర్శి సూదికొండ మాణిక్యాలరావు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న రహదారి

ప్రజాశక్తి-కోటవురట్ల : మండల కేంద్రంలో ఎంపిడిఒ కార్యాలయం ఎదురుగా ప్రధాన రహదారి చెరువును తలపిస్తోంది. చిన్నపాటి వర్షం పడితే చాలు రోడ్లపై నీళ్లు నిలిచిపోయి వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. శనివారం మధ్యాహ్నం కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్డుపై నీళ్లు నిలిచిపోయాయి. ఈ సమస్య ఏళ్ల తరబడి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల అధికారులు సమస్యను పరిష్కరించేందుకు తాత్కాలికంగా కాలువ తవ్వేందుకు ప్రయత్నించగా, ఆర్ అండ్ బి స్థలాన్ని ఆక్రమించుకున్న వారు నిలువరించడంతో రోడ్డుపై నిలిచిపోతున్న నీరును మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలోకి మళ్లించేశారు. దీంతో నీరు మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిలిచిపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.

ప్రధాన రహదారిపై నిలిచిపోయిన వర్షపు నీరు

పోరాటాలతోనే మెయిన్ సెంటర్లుగా మార్పు

ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగశేషు

ప్రజాశక్తి-అనకాపల్లి : అంగన్వాడీల పోరాటాల ఫలితంగానే మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిందని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగశేషు అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో అనకాపల్లి దొడ్డి రామనాయుడు భవనంలో శనివారం అభినందన సభ జరిగింది. యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు సిహెచ్.రామలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సభలో నాగశేషు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని అనేక సంవత్సరాలుగా ఐక్యంగా పోరాటాలు నిర్వహించడంతో రాష్ట్ర ప్రభుత్వం 4687 మినీ అంగన్వాడి సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో 42 రోజులు సమ్మె చేసిన సందర్భంగా మినీ సెంటర్‌ని మెయిన్ సెంటర్లుగా మారుస్తామని హామీ ఇచ్చిందని, కూటమి వచ్చిన తర్వాత 15 నెలల కాలంలో మరలా పోరాటం చేయడంతో మార్పు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో 1810 సెంటర్లు మినీ కేంద్రాలుగా ఉన్నాయని, వాటిని కూడా మార్పు చేయాలని కోరారు. లేకుంటే మెయిన్ టీచర్‌తో సమానంగా జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు మాట్లాడుతూ ఐక్యంగా పోరాడితే ఏదైనా సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి, ఎన్. వరలక్ష్మి, రమణి, మహాలక్ష్మి, రామలక్ష్మి, భవాని, భ్రమరాంబ, సత్యవేణి, కొండమ్మ, సుజాత, మినీ వర్కర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అంగన్వాడీ యూనియన్ నేత నాగశేషు

హిందీ దివస్‌లో పాల్గొన్న గాయత్రి విద్యార్థులు

గాయత్రి పాఠశాలలో హిందీ దివస్

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శ్రీగాయత్రి పాఠశాలలో శనివారం హిందీ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంలో విద్యార్థులకు హిందీ వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు హిందీ నాటికలు ప్రదర్శించారు. హిందీ వేషధారణలో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ బి.రామకుమార్, ప్రిన్సిపల్ వై.నగేశ్, హిందీ అధ్యాపకులు ఎఎస్.విజయ, ఎన్.సాయిస్వాతి, బి.కీర్తన పాల్గొన్నారు.

జాబ్ మేళాకు స్పందన

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు మంచి స్పందన లభించింది. ఐటీ సెక్టర్, ఫార్మా, మ్యానుఫ్యాక్చరింగ్, ట్రాన్స్పోర్టింగ్, లాజిస్టిక్స్, హ్యూమన్ రిసోర్స్, బ్యాంకింగ్ సెక్టార్ తదితర రంగాలకు చెందిన 30 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొన్నాయి. ప్రధానంగా డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీ, అరవింద ఫార్మా, హెట్టిరో ల్యాబ్స్ లిమిటెడ్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, అపోలో ఫార్మసీ, జయభేరి మోటార్స్, రాయల్ ఎన్ఫీల్డ్, క్షేమ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఐటీ నుంచి మిరాకిల్ సాఫ్ట్వేర్ కంపెనీలు పాల్గొన్నాయి. సుమారు 2206 ఉద్యోగాలుకు గాను 2000 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 10 తరగతి, ఐటిఐ, డిప్లమా, ఇంజనీరింగ్, గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు అభ్యర్థులు ఈ మెగా జాబ్ మేళాకు అభ్యర్థులు వచ్చారు. కొంతమంది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు.

జిల్లా పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర పంచాయతీ కార్యదర్శులు సమాఖ్య ఆదేశాలు మేరకు అనకాపల్లి జిల్లా పంచాయతీ కార్యదర్శులు సమాఖ్య ఎన్నికలు శనివారం అనకాపల్లిలో జరిగాయి. ఎన్నికల పరిశీలకులుగా ఏపీ ఎన్జీజీవో విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కె ఈశ్వరరావు, జిల్లా జనరల్ సెక్రటరీ ఆర్ రవిశంకర్, సిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కె సతీష్ వ్యవహరించారు. సమాఖ్య జిల్లా అధ్యక్షులుగా పి.దాలినాయుడు (రావికమతం మండలం), ప్రధాన కార్యదర్శిగా కరణం నాగేశ్వరరావు (అచ్చుతాపురం మండలం) ఉపాధ్యక్షులుగా ఎ.దిలీప్‌కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలుగా అనంత ఉమాదేవి, సంయుక్త కార్యదర్శిగా కె.సూర్యకళ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి.చిన్నోడు, ట్రెజరర్ గా ఆర్‌పి.నాయుడు, సంయుక్త ట్రెజరర్‌గా ఎన్.నాత్తానియల్ ఎన్నికయ్యారు.

ఎమ్మెల్యేకు సత్కారం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని దుప్పుతురు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పర్సన్ ఇన్చార్జిగా నియమితులైన దేశం శెట్టి వెంకటరమణ కృతజ్ఞతా భావంతో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌ను శనివారం సాలువాతో సత్కరించారు. టిడిపి మండల అధ్యక్షులు పిల్లా తులసి రాము, దేశంశెట్టి కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుని సైకిల్ యాత్రకు సంఘీభావం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : స్త్రీ శక్తి పథకం ద్వారా నష్టపోతున్న ఆటోకార్మికుల సమస్యల పరిష్కారం కోసం గాజువాకకు చెందిన శిరియాల హరేరాం చేపట్టిన సైకిల్ యాత్ర శనివారం మండలంలోని అడ్డురోడ్డుకు చేరుకున్నారు. ఆయనకు స్థానిక ఆటో కార్మికులు స్వాగతం పలికి సంఘీభావం తెలియజేశారు. ఉపాధి కోల్పోతున్న తమకు ప్రత్యామ్నాయంగా స్వయం ఉపాధి రంగంలో శిక్షణ ఇచ్చి సబ్సిడీతో కూడిన రుణాలు అందించాలని కోరారు. కూటమి నాయకులను ఈ నెల 20న కలిసేందుకు సహకరించాలని కోరారు.

కరాటే టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ మండలం జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ డీఎస్ఎ ఇండోర్ స్టేడియంలో 5వ కుడో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కరాటే టోర్నమెంట్-2025ను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శనివారం ప్రారంభించారు. యువత క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పంచకర్ల ప్రసాద్ రావు, బొడ్డపు శ్రీనివాసరావు, వియ్యపు చిన్నా, పైల జగన్నాధరావు, కన్నూరు వెంకటరమణ, మాసవరపు అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దళితుల పాకలు తొలగించి రహదారి నిర్మాణం సరికాదు

బాధిత దళితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఎల్లుప్పి రెవిన్యూ పరిధి సర్వే నెంబర్ 16, 14, 10ల్లో నీరు ప్రవహిస్తున్న ప్రభుత్వ గెడ్డ వాగులో దళితుల పశువుల పాకలను తొలగించి రహదారి నిర్మించడం చట్టవిరుద్ధమని ఎపి ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి పేర్కొన్నారు. శనివారం ఆయన సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లుప్పి గ్రామంలో ఓ వ్యక్తికి 150 ఎకరాల భూమి ఉండగా, ఆ భూమిలోకి వెళ్లేందుకు దళితుల పశువుల పాకలను అక్రమంగా తొలగించి రహదారి వేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ గెడ్డను మొత్తం కప్పేస్తే మొగల్ చెరువుకు నీరు ఎలా ప్రవహిస్తుందని ప్రశ్నించారు. దళితుల పక్షాన తాము పోరాటం చేస్తామన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సందర్భంగా పశువుల పాకలకు చెందిన దళిత రైతులు కాకర అమ్మతల్లి, గోపినాధ్, వెంకట రమణ, చిన అప్పలరాజు, చండేశ్వరరావు, మచ్చ దేముడు, ఎల్లపు అంబేద్కర్‌లు బాబ్జికి తమ సమస్యలను విన్నవించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గండి ముత్యాలనాయుడు, గండి దేముడు, కె.రామకృష్ణరాజు, బొబ్బరి కన్నారావు, కోరాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, తక్షణమే ట్రాఫిక్ సమస్యలను క్రమబద్ధీకరించి ప్రజలకు భద్రత రక్షణలను కల్పించాలని కోరుతూ పోలీస్ ట్రాఫిక్ సిఐ ఎమ్.వెంకటనారాయణకు సిద్ధార్ధసోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన సిఐ జివిఎంసి అధికారులతో సమీక్షించి ఈ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

అండర్ బ్రిడ్జి రహదారి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : మూలపేట వద్ద దొంగ గెడ్డ అండర్ బ్రిడ్జి రహదారిలో వర్షపు నీరు పొంగి ప్రవహిస్తుండడంతో ఆ గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని అఖిలపక్ష నాయకులు వాపోయారు. శనివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికి కూడా దొంగ గెడ్డ అకస్మాత్తుగా పొంగి ఆ దారి గుండా వెళ్లే సత్యనారాయణపురం, మూలపేట ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. దొంగ గెడ్డ అండర్ బ్రిడ్జి రహదారిలో సమస్యతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితిలో ఉందని పేర్కొన్నారు. తక్షణమే నిధులు మంజూరు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వైఎన్ భద్రం, కొణతాల హరనాథ్ బాబు, సూదికొండ మాణిక్యాలరావు పాల్గొన్నారు.

వైద్యాధికారి సంధ్యారాణికి సత్కారం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం తురకలపూడి పిహెచ్‌సి వైద్యాధికారి సంధ్యారాణికి జిల్లాస్థాయిలో ఉత్తమ వైద్యాధికారి అవార్డు వచ్చిన సందర్భంగా శనివారం జడ్పిటిసి సభ్యులు దొండా రాంబాబు ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలకు గుర్తింపు లభించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ వై.గోవింద, ఉప సర్పంచ్ జి.అప్పలనాయుడు మాజీ సర్పంచ్ కోరుకొండ అప్పలనాయుడు, స్థానిక నాయకులు యు.రాజారావు, నర్సింగ, అర్జున, పలు గ్రామాల సర్పంచ్‌లు వరకృష్ణ, కోటేశ్వరరావు, మచ్చకర్ల శ్రీను, నానిపల్లి శ్రీను, గోపిశెట్టి శ్రీనివాసరావు, అమ్మునాయుడు, జి.ఆనంద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు జెడ్‌పిటిసి శంకుస్థాపన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని తురకలపూడి గ్రామపంచాయతీలో రూ.40 లక్షలతో అభివృద్ధి పనులకు శనివారం జెడ్పిటిసి దొండా రాంబాబు శంకుస్థాపన చేశారు. రూ.20 లక్షలతో శ్మశానం చుట్టూ కాంపౌండ్ వాల్, రూ.20 లక్షలతో రెల్లి కాలనీ నుండి గవర్నమెంట్ హాస్పిటల్ బ్యాక్ సైడ్ వరకు సిసి డ్రైన్ నిర్మాణానికి ఈ భూమి పూజ చేశారు. ఇప్పటికే తన జెడ్పిటిసి గ్రాంట్ నుండి మండలంలో సుమారు 300 వరకు తాగినీటి బోర్లు ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా రాంబాబు తెలిపారు. సర్పంచ్ వై.గోవింద, ఉపసర్పంచ్ అప్పల నాయుడు, మాజీ సర్పంచ్ కోరుకొండ అప్పలనాయుడు, ఉల్లింగుల రాజారావు, నర్సింగ, అర్జున పాల్గొన్నారు.

గ్రామాల్లో 'విద్యార్థి మేలుకో'

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : విద్యార్థి మేలుకో కార్యక్రమంలో భాగంగా మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు శనివారం ఉపాధ్యాయులు వెళ్లారు. దిబ్బిడి, బుచ్చయ్యపేట, పోలేపల్లి, నేతవాణిపాలెం, ఐతంపూడి గ్రామాలలోని 30 మంది విద్యార్థుల ఇళ్లకు గణిత ఉపాధ్యాయులు ఎవిఎన్.మూర్తి సందర్శించారు. పాఠశాలకు గైర్హాజరువుతున్న వీరి ప్రగతిని తల్లిదండ్రులకు వివరించారు ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కేతిరెడ్డి సత్యారావు మాట్లాడుతూ విద్యార్థులకు మంచి ఆరోగ్యం, విజ్ఞానం, భవిష్యత్ కోసం "విద్యార్థి మేలుకో" కార్యక్రమం పాఠశాల పరిధిలో ప్రారంభించినట్లు తెలిపారు.

రాష్ట్ర లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పరవాడ : భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 15న జరుగు రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. చలో విజయవాడ కార్యక్రమం కరపత్రాలను శనివారం పరవాడలో విడుదల చేశారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ రాష్ట్రంలో 25 లక్షలకుపైగా భవన నిర్మాణ కార్మికులు ఉండగా, వీరిలో 18 లక్షల పైగా రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో నమోదు చేసుకున్నారని తెలిపారు. వీరి సంక్షేమం పట్ల వైసిపి, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో ఎన్ నాగప్పరావు, పివి రమణ, డి అప్పారావు, ఎస్.సత్యరావు, జి.సన్యాసిరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఎపిటిఎఫ్ నేతల వినతి

ప్రజాశక్తి-యలమంచిలి : ఎపిటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు నిరసన వారంలో భాగంగా కోర్కెల సాధన కోసం స్థానిక ఎమ్మెల్యే సందరపు విజయకుమార్‌ను ఆ సంఘం స్థానిక నేతలు శనివారం కలిసి వినతి పత్రం సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎలు, సిపిఎస్ రద్దు, ఐఆర్ ప్రకటన, ఇహెచ్ఎస్ పరిమితి రూ.25 లక్షలకు పెంపు, ఉపాధ్యాయుల్ని బోధనకే పరిమితం చేయాలన్న ప్రధాన డిమాండ్లతో వినతి పత్రంలో పేర్కొన్నట్లు పేర్కొన్నారు. సంఘం నాయకులు కె.శ్రీనివాసరావు, చంద్రశేఖర్, త్రినాధస్వామి, కన్నం శ్రీను, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్నేహితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థులు కష్టాలో ఉన్న తన స్నేహితునికి ఆర్థిక సాయం అందించారు. తమతో చదువుకున్న దేవర చిలుకునాయుడు ఇటీవల ప్రమాదానికి గురై కదలలేని పరిస్థితిలో మంచం పైనే జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ ప్రమాదంలో ఆయన భార్య మృతి చెందారు. చిలుకనాయుడు పరిస్థితిని గమనించిన తోటి పూర్వ విద్యార్థులందరూ కలిసి రూ.86,700 నగదును శనివారం అందజేశారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ : ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పరవాడలో శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, మాజీ జడ్పిటిసి పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, టిడిపి సీనియర్ నేత పైల సన్యాసినాడు, తహశీల్దారు బి.నాగరాజు, ఎంపీడీవో రమేష్ నాయుడు, కూటమి నేతలు వియ్యపు చిన్న, బొద్దపు శ్రీనివాసరావు, కర్నూలు వెంకటరమణ, పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

గిరిజనులకు కలుషిత నీరే గతి

- ప్రబలుతున్న వ్యాధులతో సతమతం
- నిర్మాణం చేపట్టని తాగునీటి పథకాలు
- ఇదీ కొత్త వీధి గ్రామంలో దుస్థితి

గెడ్డలో నీటిని తోడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి-చీడికాడ:సుమారు 40 ఏళ్లుగా నివసిస్తున్న ఆదివాసి గిరిజనులకు గుక్కెడు తాగునీరు దొరకని పరిస్థితి నెలకొంది. గొంతు తడుపుకునేందుకు ఆకులు, అలములు పడి కలుషితమైన నీటిని ఉపయోగిస్తున్నారు. ఈ నీటిని తాగి అనారోగ్యాలకు గురవుతున్నామని గిరిజనులు వాపోతున్నారు.

చీడికాడ మండలంలోని కోనాం పంచాయతీ శివారు కొత్త వీధి గ్రామానికి రక్షిత మంచినీటి పథకం, తాగునీటి బోరు సైతం ప్రభుత్వం కల్పించలేదు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి మంచినీటి పథకం అమలు చేయాలని నిబంధనలు ఉన్నా కూడా ఈ గ్రామంలో ఏర్పాటు చేయలేదు. దీంతో తాగేందుకు స్వచ్ఛమైన నీరు దొరకక ఊట గెడ్డ నీటిని తాగుతూ అనారోగ్యాలకు గురై ఆస్పత్రిలో చేరిన సంఘటనలు లేకపోలేదు.

గతంలో ఇదే గ్రామానికి చెందిన నలుగురు ఐదుగురు అనారోగ్యం బారిన పడి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. గిరిజనులు అనేక మార్లు నిరసనలు చేపట్టారు. స్పందించిన అధికారులు గ్రామంలో బోరు ఏర్పాటు చేసి ఇంటింటికి తాగు నీటిని కల్పించే చర్యలకు పూనుకున్నారు. ఇంతలో ఆ భూములతో సంబంధం లేని వ్యక్తి అడ్డుకోవడం తో ఆ పనులు కాస్త నిలిచిపోయాయి. దీనిపై సర్వే నిర్వహించిన అధికారులు అడ్డుకున్న వ్యక్తికి సంబంధం లేదని చెబుతున్నప్పటికీ సంబంధిత తాగునీటి సరఫరా విభాగపు అధికారులు మీన మీషాలు లెక్కిస్తున్నారే కానీ గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించేందుకు శ్రద్ధ చూపడం లేదు. దీంతో, గ్రామస్తులు తాగునీరు లేక అష్ట కష్టాలు పడుతున్నారు. ఎన్నికల ముందు గ్రామానికి వచ్చి సకల సౌకర్యాలు కల్పిస్తామని హామీలు ఇచ్చే నేతలు అనంతరం మర్చిపోతుండడంతో తమ జీవితాల లో మార్పులు రాలేదని ఆదివాసి గిరిజనులు ఆవేదన వ్యక్త పరిచారు. అధికారులు స్పందించి తమకు తాగనీటి సౌకర్యం కల్పించాలని ఆదివాసి గిరిజనులు కోరారు.

కృష్ణదేవిపేట ఎస్ఐ బదిలీ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు బదిలీ అయ్యారు. ఆయన్ను నాతవరం ఎస్సైగా బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణదేవిపేట ఎస్సైగా పని చేసినంత కాలం తారకేశ్వరరావు విధి నిర్వహణలో తనదైన మార్క్ చూపించి ఇక్కడి వారికి సుపరిచితులుగా మారారు. నేరాల నియంత్రణలో ఎంతో సమర్ధవంతంగా పని చేశారు. యువత చెడు వ్యసనాలకు గురి కాకుండా క్రీడలపై మక్కువ చూపేలా వారిలో ప్రేరణ కల్పించారు. వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతీ యువకులకు ప్రత్యేక కోచింగ్ ఏర్పాటు చేశారు.

ఎస్ఐ తారకేశ్వరరావు

పాఠశాలలో నిరుపయోగంగా మొక్కలు

-నెల రోజులు కావొస్తున్నా నాటని వైనం

వృథాగా ఉన్న మొక్కలు

ప్రజాశక్తి -చీడికాడ:పచ్చదనం కల్పించాలనే ఆలోచనతో ప్రతి పాఠశాలకు ప్రభుత్వం మొక్కలు పంపిణీ చేసింది. పాఠశాలలో మొక్కలను నాటక పోవడంతో స్కూలు ప్రహరీ ఆవరణలో నిరుపయోగంగా ఉన్నాయి. పాఠశాలలో పచ్చదనంతో ఉండాల్సిన మొక్కలు నిరుపయోగంగా ఉండటంతో పలువురు విమర్శిస్తున్నారు. ఈ పరిస్థితి చీడికాడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నెలకొంది. ఈ మొక్కలను పాఠశాల సిబ్బంది నాటకుండా పాఠశాల గ్రౌండ్లో పడవేసి వదిలేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నెలరోజులు గా వృధాగా ఉన్నా పట్టించుకునే నాథుడే లేక పోవడం విశేషం.ఇప్పటికైనా పాఠశాల సిబ్బంది స్పందించి స్కూలు ఆవరణలో ఉన్న మొక్కలను నాటాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

స్థానిక ఎన్నికలపై మంతనాలు

- అవకాశం ఇస్తే పోటీకి రెడీ అంటున్న కూటమి నేతలు

సమావేశమైన నేతలు

ప్రజాశక్తి-రోలుగుంట:స్థానిక ఎన్నికలు నాలుగు నెలల్లో జరపాలని ఎన్నికల సంఘం ఆదేశించడంతో మండలంలో పలు గ్రామాల్లో కూటమి నాయకులు మంతనాలు జరుపుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ముందుగా వారే సన్నద్ధం అవుతున్నారు. దీనిలో భాగంగా మండలంలోని జగ్గంపేట పంచాయతీ జె.నాయుడుపాలెం గ్రామంలో మరిశా శ్రీను ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీల నేతల సమావేశమయ్యారు. ఈ పంచాయతీలో కాపు, కొప్పుల వెలమ సామాజిక వర్గాల నుండే ఆది నుండి రాజకీయంగా ప్రాతినిద్యం వహిస్తూ పదవులు పొందుతున్నారు. ఈ రెడు వర్గాల వారే ఈ గ్రామం నుండే ప్రాతినిద్యం వహించడం మండలంలో ఒక ప్రత్యేకత సంతరించుకోవడం చెప్పక తప్పదు. రిజర్వేషన్ల ప్రక్రియలో ఎవరికి సర్పంచ్ అవకాశం వస్తే వారు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఆది నుండి కాపు సామాజిక వర్గం నుండి మరిశా, బడుగు కులస్తులు, కొప్పుల వెలమ నుండి కిల్లాడ వారు ప్రాతినిద్యం వహిస్తున్నారు. ఈసారి కూటమి నుండి నలుగురు ఆశావాహులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. కాపు రిజర్వేషన్ వస్తే తాను పోటీకి సిద్ధమని సమావేశంలో మరిశా శ్రీను తన అభిప్రాయాన్ని తెలియజేశారు.

కిల్లాడ నాయుడు మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా టీడీపీ ప్రారంభం నుండి జెండాను మోసి 8 ఎన్నికల్లో ప్రతిపక్షంలో తలపడ్డాను. 2006లో మా తండ్రిగారైన కిల్లాడ రాజు ఎంపిటిసిగా ఎన్నిక కాగా ఎంపిపి పదవి ఇస్తానని అప్పటి కాంగ్రెస్ నాయకులు ఆ పార్టీలో చేరమని కోరగా పార్టీకి గ్రామ పెద్దలకు కట్టుబడి ఉంటాను తప్పా పదవిని ఆశించనని ఖరాఖండిగా చెప్పడం జరిగింది. ప్రస్తుత ఎన్నికల్లో బిసికి అవకాశం వస్తే తమకు అవకాశం ఇవ్వాలని కిల్లాడ నాయుడు తన అభిప్రాయాన్ని వెల్లడించారు. గత వైసిపి ప్రభుత్వంలో తనను ఎంపిటిసిగా గెలిపించారు. టీడీపీ ప్రభుత్వం లేకపోవడంతో గ్రామాన్ని అభివృద్ధిపరంగా న్యాయం చేయలేకపోయానని, ఈసారి అవకాశం ఇస్తే మన ప్రభుత్వం ఉంది కాబట్టి అన్ని విధాలా అందరికీ న్యాయం చేసే అవకాశాన్ని కల్పించాలని ప్రస్తుత ఎంపిటిసి బోడపాత్రుని వెంకటనరేష్ తెలిపారు.

కూటమిలో భాగంగా సర్పంచ్ పదవిని జనసేనకు కేటాయిస్తే తనకు అవకాశం ఇవ్వండని ఆ పార్టీ నాయకులు నరసింగరావు తెరపైకి వచ్చారు. గత ఎన్నికల్లో కూటమి పార్టీలో సరైన సఖ్యత లేకపోవడంతో సర్పంచ్ స్థానం వైసిపి గెలుపొందిందని, ఈసారి ఏకతాటిపై నడిచి సర్పంచ్, ఎంపిటిసి పదవులు కైవశం చేసుకోవాలనే సంకల్పంతో సమావేశం ఏర్పాటు చేశామని మరిశా శ్రీను వెల్లడించారు.

ఇదిలా ఉండగా మండలంలో జగ్గంపేట, జెపి.అగ్రహారం, కుసర్లపూడి, బుచ్చంపేట, గుండుబాడు పంచాయతీలలో కొత్త నాయకులు తెరపైకి వస్తున్నారు. ఇప్పటికే గత 20 రోజుల క్రితం కుసర్లపూడి పంచాయతీలో ఇరుపార్టీల వారు పోటీగా సభలు ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఇలా మండలంలో స్థానిక సమరం ముందుగానే కూటమి వారే ప్రారంభించారు. మండలంలో 24 పంచాయతీలు ఉండగా గత ఎన్నికల్లో 18 పంచాయతీలు వైసిపి ప్రభుత్వం కైవసం చేసుకుంది. ఈసారి కూటమి ప్రభుత్వం ఎన్ని సీట్లు కైవసం చేసుకుంటుందో వేచి చూడాలి.

యూరియా పంపిణీ చేస్తున్న నాయకులు

యూరియా పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని జోగంపేట రైతు సేవా కేంద్రం వద్ద యూరియాను మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు సంమృద్ధిగా ఎరువులు పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ జరుగుతుందని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతులు సంక్షేమ కోసం కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుర్ల సీతరామమూర్తి, జువ్వల దేముడు, పెదిరెడ్ల మల్లేశ్వరరావు, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ పుల్లేటికుర్తి రమేష్, వీఆర్వో నారాయణమూర్తి, రాజుబాబు, అగ్రికల్చర్ అసిస్టెంట్ శివ, గ్రామీణ పోలీసు లోవ కన్య, గుడివాడ మురళీ పాల్గొన్నారు.

చీడిగుమ్మల గ్రామంలో యూరియా పంపిణీ చేశతతారు. ఈ కార్యక్రమంలో చీడిగుమ్మల కోఆపరేటివ్ అధ్యక్షులు భీమిరెడ్డి సత్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షులు కామిరెడ్డి గోవింద, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దర్శించుకుంటున్న భక్తులు

వెంకన్న ఆలయంలో భక్తుల సందడి

ప్రజాశక్తి- నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో భక్తులు పోటెత్తారు. పలు ప్రాంతాల నుండి శనివారం పెద్ద సంఖ్యలో భక్తుల తరలివచ్చి కొండపైన, దిగువున ఉపాలయాల్లోనూ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్ధ ప్రసాదాలను అందజేశారు. భక్తుల తాకడితో సందడి నెలకొంది.

వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డిఎస్‌పి

పాఠశాలలో వైద్య శిబిరం

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్:స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మెయిన్‌లో పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు గోపినాథ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సుమారుగా 300 మందికి వైద్యులు పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిఎస్పి శ్రీనివాసరావు మాట్లాడుతూ, పిఆర్టియు ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ప్రశంసించారు.కిమ్స్ ఐకాన్ మేనేజింగ్ డైరెక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ,కిమ్స్ ఐకాన్ చేసే సేవలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐ గోవిందరావు పాల్గొన్నారు.

సెల్ సిగ్నల్ లేక అవస్థలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేట బిఎస్ఎన్ఎల్ వినియోగదారులకు కష్టాలు తప్పడం లేదు. ఇక్కడ బిఎస్ఎన్ఎల్ టవర్ ప్రారంభించినా సిగ్నల్స్ సమస్యతో అవస్థలు పడుతున్నామని వినియోగదారులు తెలిపారు. రెండు మూడు గంటలు విద్యుత్ సరఫరా నిలిచిందంటే చాలు నాలుగైదు రోజులు సిగ్నల్ ఉండని పరిస్థితి నెలకొంటుంది. సిగ్నల్ వచ్చినా సేవలు అరకొరగానే ఉంటాయి. 15 సార్లు ప్రయత్నిస్తేనే తప్పా ఫోన్లు కలిసే పరిస్థితి లేదని వారు చెబుతున్నారు. బిఎస్ఎన్ఎల్ అరకొర సేవల ఫలితంగానే వినియోగదారులు చాలావరకు ఇతర నెట్వర్క్ లకు మారిపోతున్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు, దళితులు

క్వారీని రద్దు చేయకుంటే ఉధృత పోరాటం

- కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి చిరంజీవి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మాకవరపాలెం మండలం జి.కోడూరు గ్రామంలో క్వారీని తక్షణమే రద్దు చేయకుంటే పోరాటం ఉధృతం చేస్తామని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈ.చిరంజీవి తెలిపారు. నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన నిరాహార దీక్ష శనివారం 53వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈ.చిరంజీవి మాట్లాడుతూ, 53 రోజులుగా రైతులు తమ పనిపాట్లు మానేసి కుటుంబాలతో సహా దీక్షలు, నిరసనలు చేపడుతున్నా ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే రాళ్ల క్వారీని రద్దు చేసి రైతులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐబిఎస్పి రాష్ట్ర కార్యదర్శి బహుజన బొట్టా నాగరాజు, రైతు సంఘం నాయకులు అప్పారావు, పెంటయ్య, లోవరాజు, నాగభూషణం, సతీష్, గణేష్‌తో పాటు పలువురు మహిళలు కూడా పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేసిన ఎంపిటిసి సభ్యులు గోవిందరావు

హెటిరో గ్యాస్ షెడ్‌ను నిలిపేయాలి

-హోం మంత్రి కి వినతి

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలో న్యాయంపూడి గ్రామం రెవిన్యూ పరిధిలో హెటిరో డ్రగ్స్ కంపెనీ ఏర్పాటు చేస్తున్న గ్యాస్ షెడ్డును నిలుపుదల చేయాలని హెూం మంత్రి వంగలపూడి అనితకు ఎంపీటీసీ సభ్యులు ఆకేటి గోవిందరావు వినతిపత్రం అందజేశారు. అమరావతిలో శనివారం హెూం మంత్రిని అనిత ను కలిసి సమస్యను విన్నవించారు. గ్యాస్ షెడ్ చాలా చాలా ప్రమాదకరమైం దన్నారు. న్యాయంపూడి, కాగిత, వెదుళ్ల పాలెం గ్రామాల ప్రజలకు హాని కలుగుతుందని, వెంటనే నిలుపుదల చేయాలని కోరారు.

బంగారం కోసం కన్న తల్లిని కడతేర్చాడు

- నిందితుడు అరెస్ట్ - 24 గంటల్లోనే కేసును ఛేదించాం - డిఎస్‌పి శ్రీనివాసరావు వెల్లడి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మద్యానికి బానిసగా మారిన కొడుకు తల్లి మెడలోని బంగారు తాడు కోసం కన్నతల్లిని చంపేసిన ఘటన నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాతవరం మండలం వై.బి. పట్నం గ్రామంలో చోటు చేసుకుంది. నిందితుడు చిటికెల రామ్మూర్తి రాయుడును 24 గంటల్లోనే పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విషయమై డీఎస్పీ శ్రీనివాసరావు శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలియజేసిన వివరాలు.. తల్లిదండ్రులు నిద్రిస్తున్న సమయంలో మద్యం తాగిన కొడుకు చిటికెల రామ్మూర్తి రాయుడు పెద్ద కేకలు వేస్తూ, తండ్రిని తోసేసి, పూల కుండీతో తల్లి తలపై బలంగా కొట్టాడు. మెడలో ఉన్న బంగారుతాడు ఇవ్వకపోతే ఇద్దరిని చంపేస్తానని బెదిరించాడు. ఇవ్వడానికి నిరాకరించడంతో పూల కుండీతో తలపై కొట్టి, కన్నతల్లి మెడను కాలితో తొక్కి బంగారు తాడు తీసుకొని పారిపోయాడు. తీవ్ర గాయాలు పాలైన తల్లి చిటికెల మంగ అక్కడికక్కడే మరణించింది. ఫిర్యాదు అందిన వెంటనే సిఐ రేవతమ్మ సంఘటన స్థలానికి చేరుకొన్నారు. నిందితుడు రామ్మూర్తినాయుడుని నాతవరం మండలం గన్నవరం మెట్ట వద్ద సంచరిస్తున్నట్లు సమాచారం తెలుసుకొని సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో నిందితుడిని పట్టుకున్నారు. అతని నుంచి 21 గ్రాముల బంగారు తాడు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేయడం జరిగిందని నర్సీపట్నం డిఎస్పి శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ సమావేశంలో నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, రూరల్ ఎస్సై పి.రాజారావు, గొలుగొండ ఎస్సై పి.రామారావులు పాల్గొన్నారు.

దువ్వాడ 'విజ్ఞాన్'లో విస్తా 2కె25 టెక్ ఫెస్ట్

ప్రజాశక్తి-ఉక్కునగరం : దువ్వాడ విజ్ఞాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో జాతీయస్థాయి 2కె25 టెక్ ఫెస్ట్ 'సస్టెయినబుల్ సినర్జీ: ఇండస్ట్రీ 4.0 ఇన్ యాక్షన్' థీమ్‌తో శనివారం ప్రారంభమైంది. అబ్దుల్ కలాం సెంటర్ ఫర్ నేషనల్ బిల్డింగ్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఫెస్ట్‌ను అతిథులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఇంజనీర్స్ డే వేడుకలను పురస్కరించుకుని ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హ్యాకథాన్, ఐడియాథాన్, యాప్ డిజైన్, సర్క్యూట్రిక్స్, రోబో రేస్, డ్రోన్ పోటీలు ప్రాజెక్ట్ ఎక్స్‌పో, టెక్నికల్ క్విజ్, బిజినెస్ ఐడియా, పేపర్ అండ్ పోస్టర్ ప్రజెంటేషన్, వంటి వివిధ అంశాల్లో జాతీయ స్థాయి సాంకేతిక పోటీలల్లో ఐదు వేలమంది విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శించనున్నారని నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా బిడిఎల్, వియు యూనిట్ అదనపు జనరల్ మేనేజర్ శ్రీధర్ సింగ్ మాట్లాడుతూ ఇండస్ట్రీ 4.0 అనేది సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణ సమన్వయమని, విద్యార్థులు ఇలాంటి వేదికల ద్వారా కొత్త ఆలోచనలు ఆవిష్కరించి భవిష్యత్తు పరిశ్రమలకు దోహదపడాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె సుధాకర్ మాట్లాడుతూ టెక్నికల్ ఫెస్ట్ అనేది విద్యార్థులు సాంకేతిక ఆవిష్కరణలో తాజా పురోగతులను అన్వేషించడానికి ఒక శక్తివంతమైన మార్గమన్నారు. రెక్టార్ డాక్టర్ వి మధుసూధనరావు మాట్లాడుతూ, విద్యార్థులు తమ ప్రాజెక్టులు, లేదా ఆవిష్కరణలను ప్రదర్శించేందుకు ఇటువంటి టెక్ ఫెస్ట్‌లు మంచి వేదికలుగా నిలుస్తాయన్నారు. సదస్సు. కన్వీనర్ ప్రొఫెసర్ క్రాంతికుమార్ గంగు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యార్థులు పాల్గొనడం ద్వారా విజ్ఞాన్ విద్యార్థులకు ఈ ఫెస్ట్ జాతీయస్థాయి అనుభవాన్ని అందిస్తుందన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

టెక్ ఫెస్ట్‌ను తిలకిస్తున్న అతిథులు

ఏచూరి స్ఫూర్తితో ప్రజా పోరాటాలు

సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

కార్మిక కర్షక హక్కుల సాధనతో పాటు లౌకిక పరిరక్షణ ఉద్యమాల్లో సిపిఎం మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరిది కీలక పాత్ర అని సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు అన్నారు. అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో శనివారం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగింది. ముందుగా సిపిఎం సీనియర్ నాయకులు గండి నాయినబాబు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మితవాద శక్తుల ప్రాబల్యం పెరగుతున్న నేపథ్యంలో వాటిని ఎదుర్కొనేందుకు సీతారాం ఏచూరి స్ఫూర్తితో ప్రజా పోరాటాలను సాగించాలని పిలుపునిచ్చారు. కార్మిక, కర్షక రంగాల హక్కుల సాధనతోపాటు లౌకిక పరిరక్షణ ఉద్యమాల్లో తుది శ్వాస వరకూ ఏచూరి పోరాడారని పేర్కొన్నారు. ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ విధించిన అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం విద్యార్థి దశలోనే సీతారాం ఏచూరి ఉద్యమించారని తెలిపారు. దేశంలో ప్రబలుతున్న మతోన్మాద శక్తులు, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా లౌకిక వాదులు, మేధావులు, ప్రజాస్వామ్య శక్తులను ఏకం చేసి దేశ ఐక్యత కోసం అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల శంకరరావు మాట్లాడుతూ దేశంలో అప్రకటిత ఎమర్జెనీ నడుస్తోందని, ఎన్నికల్లో తన రాజకీయ శత్రువులను ఓడించేందుకు బిజెపి కుట్ర పన్నుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 130వ రాజ్యాంగ సవరణ న్యాయ శాస్త్రంలోని మౌలిక విధానానికి విరుద్ధమన్నారు. మతోన్మాద ఉపద్రవాన్ని పసిగట్టి, దేశానికి పెనుముప్పు రాబోతుందని ఆనాడే చెప్పిన గొప్ప దార్శనికుడు సీతారాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, నాయకులు కె.ఈశ్వరరావు, కాళ్ళ తేలయ్యబాబు, జి.సుభాషిణి, ఏసు పాల్గొన్నారు.

ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-పాయకరావుపేట : విద్యార్థులు సవాళ్లను అధిగమిస్తూ అవకాశాలను అందిపుచ్చుకోవాలని భారతీయ వరి పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్ఎమ్ సుందరం అన్నారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన యువ ప్రేరణ (స్వయం ప్రతిపత్తి) సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు మార్కుల కోసం కాకుండా జ్ఞాన సముపార్జనపై దృష్టి పెట్టాలని తెలిపారు. కృత్రిమ మేధస్సుతో పనులు జరిగే రోజుల్లో మనం ఉన్నామని, మన ఆలోచనల్లో సృజనాత్మకత లేకపోతే మనం కేవలం యాంత్రికంగా మిగిలిపోతామని చెప్పారు. గౌరవ అతిథి డాక్టర్ ఎస్వి ప్రసాద్ మాట్లాడుతూ మార్కులు విద్యార్థుల మేధస్సుకు కొలమానం కాదని, లక్ష్య సాధన కోసం మొదటి నుండి కృషి చేయాలని సూచించారు. అనంతరం శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె నరసింహారావు, ప్రెసిడెంట్ డాక్టర్ కంటిపూడి నరేంద్రబాబు, సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్, అతిథులు అకడమిక్ క్యాలెండరును విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, డీన్ డాక్టర్ వివిఎస్‌బి బంగార్రాజు, వైస్ ప్రిన్సిపల్ పెనుగొండ సుబ్బారావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అకడమిక్ కేలండర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం